



# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 11 సంచిక : 309 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు మంగళవారం 15 జూలై 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 309 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE TUE 15 JULY 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada,Visakhapatnam, Circulated by Srikakulam,Vizianagaram, Eluru,Vijayawada,Guntur, Nelloru,Chittur,YSR Kadapa, Kurnool, Anantapur

## నేటి నుంచి చంద్రబాబు
# ఢిల్లీ పర్యటన...

- రెండ్రోజుల పాటు ఢిల్లీలో ఏపీ సీఎం చంద్రబాబు పర్యటన
- హస్తినలో కేంద్రమంత్రులతో చంద్రబాబు కీలక సమావేశాలు
- పలు కార్యక్రమాలతో చంద్రబాబు ఫుల్ బిజీ



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనకు వెళ్లనున్నారు. దేశ రాజధానిలో ఆయన రెండు రోజుల (జులై 15, 16) పాటు పర్యటించనున్నారు. ఈ సందర్భంగా ఆయన పలు కీలక సమావేశాల్లో పాల్గొని, రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చించనున్నారు.

**పర్యటన వివరాలు...**

జులై 15 (మంగళవారం) ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి బయలుదేరి 11:45 గంటలకు

వివరాలు 2లో..

## ఫైబర్ నెట్‌లో వైసీపీ కార్యకర్తల్ని
# నియమించి దోచుకున్నారు

- ఏపీ ఫైబర్ నెట్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
- సంస్థను మళ్లీ గాడినపెడదాం అంటూ అధికారులకు దిశానిర్దేశం
- కొత్త విధానాలు అమలు చేసి కనెక్షన్లు పెంచుకోవాలని సూచన
- భారత్ నెట్ కార్యక్రమంతో ఫైబర్ నెట్ అనుసంధానానికి ఆమోదం



పెన్ పవర్ డెస్క్:గతంలో 2014-19 మధ్య ప్రతిష్ఠాత్మకంగా తీసుకువచ్చిన ఏపీ ఫైబర్ నెట్ ప్రాజెక్టును వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందని... దీన్ని తిరిగి గాడిలో పెట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో అన్నారు. సంస్థ ముందున్న సవాళ్లు, ఆర్థిక సమస్యలు, ఫైబర్ నెట్‌ను పూర్తి స్థాయిలో గాడిన పెట్టేందుకు తీసుకోవాల్సిన చర్యలు, కొత్త పాలసీ నిర్ణయాలపై సోమవారం నాడు సచివాలయంలో అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. ప్రజలకు, విద్యార్థులకు, ప్రభుత్వ విభాగాలకు ఉపయోగపడాల్సిన వ్యవస్థను గత ప్రభుత్వం రాజకీయ అవసరాల కోసం వాడుకుందని... దీంతో ఫైబర్ నెట్ ప్రాజెక్టు లక్ష్యం దెబ్బతిందని సీఎం అన్నారు. 2019లో 8.70 లక్షల కనెన్షన్‌లు ఉండగా... వైసీపీ ప్రభుత్వంలో వాటి సంఖ్య 4.50 లక్షలకు పడిపోవడమే ఇందుకు నిదర్శనం అని గుర్తు చేశారు.

**దొడ్డిదారిన వైసీపీ కార్యకర్తలకు కొలువులు**

"నాడు కేవలం 130 మంది ఉద్యోగులతో సంస్థను అద్భుతంగా నడిపాం... 8 లక్షలకు పైగా కనెక్షన్లు ఇచ్చాం...కానీ వైసీపీ ప్రభుత్వం తన పార్టీ కార్యకర్తలకు ఉద్యోగుల కోసం సంస్థలో లేని పోస్టులు సృష్టించింది. 130 మంది ఉద్యోగులను 1,350కి పెంచి దోచుకుంది. ప్రభుత్వ వ్యవస్థల్లో వందల, వేల మందిని నియమించి... పార్టీ కోసం పని చేయించుకునే కొత్త తరహా అవినీతికి గత ప్రభుత్వం పాల్పడింది. ఫైబర్ నెట్‌లో సొంత వాళ్లను నియమించి పార్టీ కోసం పని చేయించుకున్నారు. దీనికి కారణమైన వారిని గుర్తించాలి. నాటి నియామకాలపై విచారణ జరిపి... అన్ని వివరాలు వెలుగులోకి తీసుకురావాలి. ఇదే సమయంలో నాటి తప్పులను సరిదిద్ది భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి" అని సీఎం అన్నారు. ప్రస్తుతం 4,53,525 వరకు ఉన్న కనెక్షన్లను... తిరిగి 8 లక్షల నుంచి 10 లక్షలకు పెంచాలని సూచించారు.


**10 ఏళ్లలో కేంద్రం నుంచి రూ.1,900 కోట్లు**

భారత్ నెట్ (Amended BharatNet Programme-ABP)తో ఏపీ ఫైబర్ నెట్‌ను

వివరాలు 2లో..

## ఇండోనేషియాలో
# భారీ భూకంపం

- తులాల్ నగరానికి 117 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రం
- రిక్టర్ స్కేలుపై 6.9 తీవ్రతతో భూకంపం
- సునామీ వచ్చే అవకాశాలు లేవని వాతావరణ కేంద్రం వెల్లడి



పెన్ పవర్ డెస్క్:ఇండోనేసియాలో భారీ భూకంపం సంభవిం చింది. తులాల్ నగరానికి 177 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు. భూకంపం రిక్టర్ స్కేలుపై

వివరాలు 2లో..

## తిరుపతి రైల్వే స్టేషన్ లో భారీ అగ్నిప్రమాదం... రాయలసీమ, షిరిడి ఎక్స్ ప్రెస్ రైళ్లలో మంటలు!

- లూప్ లైన్ లో ఉన్న రైళ్లలో ఒక్కసారిగా మంటలు
- రెండు బోగీలు దగ్ధం
- భయాందోళనలకు గురైన ప్రయాణికులు




పెన్ పవర్ డెస్క్:తిరుపతి రైల్వేస్టేషన్‌లో సోమవారం నాడు భారీ అగ్నిప్రమాదం సంభవించింది. లూప్‌లైన్‌లో ఆగివున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్, షిరిడీ ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో రెండు

వివరాలు 2లో..

## గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు...
# రాష్ట్రపతి భవన్ ప్రకటన

- రెండు రాష్ట్రాలకు గవర్నర్ల నియామకం
- ఓ కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్ నియామకం
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



పెన్ పవర్ డెస్క్:టీడీపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్తర్వులు జారీ చేశారు. ఇవాళ రెండు రాష్ట్రాలకు గవర్నర్ లను, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి లెఫ్టినెంట్ గవర్నర్‌ను నియమించారు. గోవా గవర్నర్‌గా అశోక్ గజపతి రాజు, హర్యానా గవర్నర్‌గా ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తాలను

వివరాలు 2లో..

## విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు..
# కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు

- ఇలాంటి ప్రసంగాలను కట్టడి చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్న ధర్మాసనం
- కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు ఆదేశాలు
- వాక్ స్వాతంత్ర్యం విలువలు ప్రజలు తెలుసుకోవాలన్న సుప్రీంకోర్టు



పెన్ పవర్ డెస్క్:విద్వేషపూరిత ప్రసంగాల కేసులపై సుప్రీంకోర్టు తీవ్రంగా స్పందించింది. ఇటువంటి ప్రసంగాలను అరికట్టడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించింది. అదే సమయంలో భావప్రకటనా స్వేచ్ఛను ఉల్లంఘించకూడదని స్పష్టం చేసింది. వాక్ స్వాతంత్ర్యపు విలువలను పౌరులు తెలుసుకొని, విద్వేషపూరిత ప్రసంగాల పట్ల సంయమనం పాటించాలని

వివరాలు 2లో..

## ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు
- పోర్టల్‌ను రూపొందించిన ఏపీ డ్రోన్ కార్పోరేషన్
- రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ డ్రోన్ మార్ట్ సేవలు



పెన్ పవర్ డెస్క్:టెక్నాలజీ ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్న లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం.. డ్రోన్ సేవలను సామాన్యులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇందుకు సంబంధించి ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ను సోమవారం నాడు సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించారు. డ్రోన్ మార్ట్ ద్వారా వ్యవసాయం సహా వివిధ రంగాల్లో డ్రోన్ల ద్వారా సేవలు పొందేందుకు పోర్టల్‌ను ఏపీ డ్రోన్ కార్పోరేషన్ రూపొందించింది. ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ద్వారా వ్యవసాయం, ఇన్ఫ్రా, విపత్తు నిర్వహణ వంటి అంశాల్లో ఈ పోర్టల్ ద్వారా సేవలు పొందవచ్చు.

ఇటీవల కాలంలో తులు తమ పొలాల్లో మందులు పిచికారీ చేయాలంటే డ్రోన్లు వినియోగిస్తున్నారు. డ్రోన్ల ద్వారా పంటల పర్యవేక్షణ కూడా చేపట్టవచ్చు.

వివరాలు 2లో..

## ర్యాంకర్లను సన్మానించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

- జాతీయ స్థాయిలో తెలుగు విద్యార్థుల సత్తా
- ఉండవల్లి నివాసంలో విద్యార్థులను కలిసిన మంత్రి నారా లోకేశ్
- రాష్ట్రానికి గర్వకారణంలా నిలిచారని అభినందనలు



పెన్ పవర్ డెస్క్:నీట్ యూజీ, జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో జాతీయ స్థాయిలో అద్భుత ర్యాంకులు సాధించిన ఆంధ్రప్రదేశ్ విద్యార్థులను రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. రాజమండ్రికి చెందిన డి.కార్తీక్ రామ్ నీట్ యూజీ పరీక్షలో ఓపెన్ కేటగిరీలో జాతీయ స్థాయిలో 19వ ర్యాంక్, ఏపీ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించగా, జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో పాలకొల్లుకు చెందిన కోటిపల్లి యశ్వంత్ సాత్విక్ 113వ ర్యాంక్, రాజమండ్రికి చెందిన కంచుమర్తి ప్రణీత్ 311వ ర్యాంక్ సాధించారు.ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు ఆధ్వర్యంలో ఉండవల్లిలోని తన నివాసంలో ఈ విద్యార్థులను కలిసిన మంత్రి నారా లోకేశ్, వారి ప్రతిభకు ముగ్ధులైనట్లు తెలిపారు. "తమ కృషి, పట్టుదలతో

వివరాలు 2లో..

## పేర్ని నానీ నీకంత కొవ్వు పట్టిందా?
# వంశీ ఇలా మాట్లాడే ఊచలు లెక్కబెట్టి వచ్చాడు



పెన్ పవర్ డెస్క్:పేర్ని నాని వ్యాఖ్యలు వెనుక కుట్ర దాగి ఉందని, టీడీపీని రెచగొట్టి కొడాలి నాని, వల్లభనేని వంశీలను అరెస్ట్ చేయిస్తే తన కొడుకుకి కృష్ణా జిల్లా సామ్రాజ్యాన్ని అప్పగించాలని పేర్ని నాని పన్నిన పన్నాగమే ఇందంతా అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి దుయ్యబట్టారు. సోమవారం మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన ఆయన వైసీపీ విలువలు లేని రాజకీయాలు చేస్తుందని, పేర్ని నాని వాడిన భాష సరైనది కాదు అని వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..."కూటమి ప్రభుత్వం

వివరాలు 2లో..

- గత కొన్నిరోజులుగా తీవ్ర వ్యాఖ్యలు చేస్తున్న పేర్ని నాని
- మంగళగిరిలో సోమిరెడ్డి ప్రెస్ మీట్
- ఫైలుపై సంతకం పెట్టాలంటే నాని చెయ్యి వణుకుతుందని వెల్లడి
- నువ్వా చంద్రబాబు వయసు గురించి మాట్లాడేదంటూ ఫైర్
- లోకేశ్ ను ఒరే తురే అంటావా అంటూ ఆగ్రహం
- రప్పా రప్పా అంటూ సినిమా తీసుకోవాలని వ్యంగ్యం

## భారత్, చైనా సంబంధాలు ప్రపంచానికి మేలు చేస్తాయి

- అందుకు చైనాకు కృతజ్ఞతలు
- భారత్-చైనా సంబంధాలపై జైశంకర్ కీలక వ్యాఖ్యలు
- మోదీ, జిన్ పింగ్ భేటీ తర్వాత సంబంధాలు పుంజుకున్నాయన్న జైశంకర్
- విభేదాలు వివాదాలుగా మారకూడదన్న జైశంకర్



పెన్ పవర్ డెస్క్:భారత్-చైనా సంబంధాలపై విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు చేశారు. 2024 అక్టోబర్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో సమావేశమైన తర్వాత నుంచి ఇరుదేశాల మధ్య సంబంధాలు పుంజుకుంటున్నాయని అన్నారు. విభేదాలు ఎప్పుడూ వివాదాలుగా మారకూడదని, అలాగే పోటీ.. సంఘర్షణగా మారకూడదని ఆయన అన్నారు.చైనా పర్యటనలో ఉన్న జైశంకర్ ఆ దేశ విదేశాంగ శాఖ మంత్రి వాంగ్ యీతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టియాంజిన్ వేదికగా మంగళవారం నుంచి రెండు రోజుల పాటు జరగనున్న షాంఘై సహకార సంస్థ సదస్సులో

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

## జగన్ జిల్లాల పర్యటనలతో ఇంత మార్పు వచ్చిందా? వైసీపీలో హాట్ టాపిక్

వైసీపీ నేతలు దూకుడు పెంచారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి ఏడాది కాలం పూర్తియని తర్వాత గేర్ మార్చినట్లు కనపడుతుంది. ఎఫెన్స్ గా వెళ్లాలని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది. అందుకే నేతలు మాటకు మాట అంటూ సవాళ్లకు ప్రతి సవాళ్లు విసురుతున్నారు. రప్పా రప్పా డైలాగును కాకుండా అనుకున్నది చేసేయాలంటూ క్యాడర్ కు చెప్పే పరిస్థితికి వచ్చారు. గతంలో కొన్ని ప్రాంతాల్లో మాత్రమే నేతలు యాక్టివ్ గా ఉండేవారు. పేర్ని నాని, అంబటి రాంబాబు, రోజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, బొత్స సత్యనారాయణ, కారుమూరి నాగేశ్వరరావు వంటి నేతలు కొంత యాక్టివ్ గా కనిపించినప్పటికీ మిగిలన నేతలు మాత్రం పెద్దగా పట్టించుకోకుండా తమ వ్యాపారాలకు మాత్రమే పరిమితమయ్యారు.

**మొన్నటి వరకూ విమర్శలకు...**

జిల్లా అధ్యక్షులుతో పాటు రాష్ట్ర స్థాయి నేతలు, గతంలో మంత్రులుగా పనిచేసిన వారు కూడా అధికార పార్టీ ఇచ్చే విమర్శలకు పెద్దగా స్పందించడం లేదు. కేవలం కొందరు మాత్రమే రెస్పాండ్ అవుతున్నారు. జగన్ పొదిలి పర్యటనలో కానీ, రెంటపాళ్ల పర్యటన సమయంలో జరిగిన ఘటనలపై కూడా నేతలు రెస్పాండ్ పెద్దగా కాలేదు. అయితే ఇటీవల కాలంలో మాత్రం నేతలు ఇక బయటకు వచ్చారు. ఇన్నాళ్లు కేసులకు, అరెస్ట్ లకు, జైళ్లకు భయపడిన నేతలు ఇకపై భయపడబోమంటున్నారు. ఎన్నికేసులు పెట్టుకుంటారో పెట్టుకోవాలంటూ సవాళ్లు విసురుతున్నారు. ఎందుకంటే ఇక తాము భయపడితే రానున్న ఎన్నికల్లో క్యాడర్ నిలబడదన్న నిర్ణయానికి వచ్చినట్లు కనపడుతుంది.

**టిక్కెట్ తో పాటు...**

వచ్చే ఎన్నికల్లో తమకు టిక్కెట్ దక్కడం ఎంత అవసరమో.. అదే సమయంలో క్యాడర్ కూడా ధైర్యంగా రోడ్డు మీదకు వచ్చి పనిచేయాల్సి ఉంటుంది. నాయకులుగా ఉంటూ తామే వెనకడుగు వేస్తే ఇక కార్యకర్తలు ఎందుకు బయటకు వస్తారన్న భావన పెరిగిపోయింది. మరొక వైపు జిల్లాల పర్యటనకు వస్తుండటం కూడా నేతల్లో మార్పునకు కారణమయింది. జగన్ జిల్లాల పర్యటన విజయవంతం కావాలంటే కార్యకర్తల సహకారం అవసరం. వారు ఏమాత్రం భయపడినా, రాకపోయినా టూర్ ఫ్లాప్ అవుతుంది. ఆ ప్రభావం తమపై పడుతుందన్న ఆందోళన నేతల్లో వ్యక్తమవుతున్నట్లే ఉంది. పొదిలి, సత్తెనపల్లి, చిత్తూరు పర్యటనలు విజయవంతం కావడంతో అంతకు మించి తమ జిల్లాల్లో సక్సెస్ కావాలంటే తాము కూడా ఇక వీధుల్లోకి రావాల్సిందేనని నిర్ణయించుకున్నట్లు కనపడుతుంది.

**బయట ఉన్నవారు కూడా...**

అందులోభాగంగానే మొన్నటి వరకూ విదేశాల్లో ఉన్నవారు సయితం ఇప్పుడు సొంత నియోజకవర్గాలకు వచ్చి క్యాడర్ కు అందుబాటులో ఉంటున్నారు. దెందులూరు మాజీ ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి విదేశాల్లో ఏడాదిగా ఉంటూ ఈ మధ్య నియోజకవర్గానికి వచ్చారు. అలాగే తూర్పు గోదావరి జిల్లాలో సయితం జక్కంపూడి బ్రదర్స్ కూడా నియోజకవర్గంలో పర్యటిస్తూ తమ ప్రత్యర్థులపై విరుచుకుపడుతున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో అనేక మంది నేతలు బయటకు రావడం వైసీపీకి కొంత సానుకూలత వాతావరణం ఏర్పడింది. జగన్ జిల్లా పర్యటనకు ఎప్పుడు వచ్చినా పూర్తి స్థాయి సక్సెస్ చేయడమే కాకుండా తమ స్థానాలను పదిలం చేసుకునే ప్రయత్నంలో ఉన్నట్లు కనపడుతుంది.

## ఇండోనేషియాలో భారీ భూకంపం

- మొదటి పేజీ తరువాయి

6.9 తీవ్రతగా నమోదైంది. అయితే సునామీ వచ్చే అవకాశాలు లేవని వాతావరణ కేంద్రం వెల్లడించింది. పశ్చిమ ఇండోనేషియాలో ఈ మధ్యాహ్నం 12:49 గంటలకు ప్రకంపనలు వచ్చాయి. ఈ భూకంపం కారణంగా అనేక ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. నష్టాన్ని అంచనా వేస్తున్నట్లు వారు వెల్లడించారు. జాతీయ విపత్తు ప్రతిస్పందన బృందాలు వెంటనే రంగంలోకి దిగి సహాయక చర్యలు ప్రారంభించాయి. ఇండోనేసియాను నిత్యం భూకంపాలు, సునామీలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు వెంటాడుతుంటాయి. 2004లో 9.1 తీవ్రతతో ఏర్పడిన భూకంపం కారణంగా ఒక్క ఇండోనేషియాలోనే 2.3 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ప్రాంతం 'రింగ్ ఆఫ్ ఫైర్'గా పిలిచే అగ్నిపర్వతాల జోన్‌లో ఉంది.

## తిరుపతి రైల్వే స్టేషన్ లో భారీ అగ్నిప్రమాదం...

- మొదటి పేజీ తరువాయి

బోగీలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పే ప్రయత్నంలో నిమగ్నమయ్యారు. ఈ అగ్నిప్రమాదంతో తిరుపతి రైల్వే స్టేషన్ లో ఉన్న ప్రయాణికులు భయాందోళనలకు గురయ్యారు. అగ్నిప్రమాదానికి గల కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. రైల్వే అధికారులు ప్రమాద కారణాలను గుర్తించేందుకు దర్యాప్తు ప్రారంభించినట్టు తెలుస్తోంది.

# ఫైబర్ నెట్‌లో వైసీపీ కార్యకర్తల్ని నియమించి దోచుకున్నారు

- మొదటి పేజీ తరువాయి

అనుసం ధానించేందుకు ముఖ్యమంత్రి అనుమతించారు. ఈ ప్రోగ్రాంలో భాగంగా ఏపీ ఫైబర్ నెట్‌కు 2025 నుండి 2035 వరకు రూ.1,900 కోట్లు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేయనుంది. చిత్తూరు, విశాఖపట్నం జిల్లాల్లోని 1,692 గ్రామ పంచాయతీల ఫైబర్ నెట్‌వర్క్‌ను లీనియర్ నుంచి రింగ్ ఆర్కిటెక్చర్‌కు మార్చేందుకు ముఖ్యమంత్రి ఆమోదం తెలిపారు. 480 కొత్త గ్రామ పంచాయతీలకు రింగ్ ఆర్కిటెక్చర్‌తో కనెక్టివిటీ కల్పిస్తారు. ఇందుకోసం మొత్తం రూ.430 కోట్లు కేంద్రం ఇస్తుంది. ఈ కార్యక్రమాల నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో కలిసి ఒక ప్రత్యేక వాహక సంస్థ (SPV) ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు.

**కనెక్షన్లు పెంచడంపై ప్రత్యేక దృష్టి**

రాష్ట్ర స్థాయి పెట్టుబడి వ్యయం, నిర్వహణ వ్యయం పైనా సమీక్షలో ముఖ్యమంత్రి చర్చించారు. అలాగే గత ప్రభుత్వ హయాంలో కనెక్షన్ల తగ్గుదలకు గల కారణాలను విశ్లేషించారు. 2014%-%19లో రూ. 149కి ట్రిపుల్ ప్లే (ఫోన్ ం %ఖ్రుుఎ% ం ఇంటర్నెట్) ద్వారా 150 ఛానెళ్లతో సేవలు అందించగా, 2019%-%24లో నెల వారీ చార్జీలను రూ.350కి పెంచడంతో పాటు నాణ్యత లేని ప్రసారాలు అందించడం వల్ల కనెక్షన్లు తగ్గినట్టు అధికారులు తెలిపారు. ఫైబర్ నెట్‌కు సెట్ టాప్ బాక్స్ సరఫరాదారుల ఎంపికను తక్షణమే పూర్తి చేయాలని, కొత్త బాక్స్‌లను తీసుకున్న స్థానిక కేబుల్ ఆపరేటర్ తో ఆదాయానికి సంబంధించిన విధానాన్ని పునః సమీక్షించాలని సూచించారు. దూర ప్రాంతాల్లో సెట్ టాప్ బాక్స్ సరఫరా కోసం ప్రైవేట్ సంస్థలను కూడా భాగస్వాములుగా తీసుకోవాలని అన్నారు.

**12,946 పంచాయతీలకు ఫైబర్ నెట్**

గ్రామ పంచాయతీలను నెట్ అనుసంధానంలో రాష్ట్రం దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంది. రాష్ట్రంలో ఇప్పటివరకు 12,946 గ్రామ పంచాయతీలకు ఫైబర్ నెట్ సౌకర్యం కల్పించడం జరిగింది. 104 ప్రభుత్వ సంస్థలు-కార్యాలయాలకు ఫైబర్ నెట్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రస్తుతం 5 ప్యాకేజీల రూపంలో గృహాలకు ఫైబర్ నెట్ కనెక్షన్లు అందిస్తున్నారు.

21,000 కంటే ఎక్కువ సంస్థలు హై-స్పీడ్ బ్రాడ్ బ్యాండ్‌ను పొందుతున్నాయి. 175 టెలికాం టవర్స్ తో లింక్ చేశారు. దీనిని మరింత అభివృద్ధి చేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 442 ఉద్యోగులు, అధికారులు ప్రస్తుతం సంస్థలో పనిచేస్తున్నారు.

**ఫైబర్ నెట్ విస్తరణలో దేశంలోనే టాప్**

రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 78,355 కి.మీ. మేర ఫైబర్ నెట్ విస్తరించగా, మొత్తం 2 లక్షల కి.మీ. మేర ఫైబర్ నెట్ లైన్ వేయాలనేది ప్రభుత్వ లక్ష్యం. ఫైబర్ నెట్ విస్తీర్ణంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోని అన్ని రాష్ట్రాల కన్నా ముందుంది. ఆంధ్రప్రదేశ్ తర్వాత స్థానంలో మహారాష్ట్ర 50,481 కి.మీ., తమిళనాడు 49,616 కి.మీ., గుజరాత్ 35,246 కి.మీ., తెలంగాణ 29,143 కి.మీ. మేర ఫైబర్ నెట్ కలిగి ఉన్నాయి.

## నేటి నుంచి చంద్రబాబు ఢిల్లీ పర్యటన...

- మొదటి పేజీ తరువాయి

ఢిల్లీ చేరుకుంటారు.

మధ్యాహ్నం 1:00 గంటకు కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో సమావేశం.

మధ్యాహ్నం 2:30 గంటలకు 1-జన్‌పథ్‌లో నీతి ఆయోగ్ సభ్యుడు డాక్టర్ వీకే సరస్వత్‌తో భేటీ.

మధ్యాహ్నం 3:00 గంటలకు ఢిల్లీ మెట్రో ఎండీతో సమావేశం. ఈ సమావేశంలో రాష్ట్రంలో మెట్రో రైలు ప్రాజెక్టులపై చర్చ జరుగనుంది.

మధ్యాహ్నం 3:30 గంటలకు మూర్తి మార్గ్-3లో జరిగే పీవీ నర్సింహారావు సంస్మరణ సభలో ప్రసంగం.

రాత్రి 7:00 గంటలకు కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సమావేశం.

జులై 16 (బుధవారం)

ఉదయం 10:00 గంటలకు కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి మన్సుక్ ఎల్ మాండవీయతో భేటీ.

మధ్యాహ్నం 2:30 గంటలకు జలశక్తి భవన్‌లో కేంద్ర జల్‌శక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సమావేశం.

సాయంత్రం 4:30 గంటలకు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భేటీ.

రాత్రికి ఢిల్లీలోనే బస చేసి, జులై 17 (గురువారం) ఉదయం 9:30 గంటలకు అమరావతికి తిరుగు ప్రయాణం.

ఈ పర్యటనలో ముఖ్యమంత్రి రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన కీలక అంశాలపై కేంద్ర మంత్రులతో చర్చించి, అవసరమైన నిధులు, ప్రాజెక్టులకు మద్దతు కోరనున్నారు.

## విద్వేష ప్రసంగాలపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు.. కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలకు కీలక ఆదేశాలు

- మొదటి పేజీ తరువాయి

సుప్రీంకోర్టు సూచించింది. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ శర్మిష్ఠా పనోలిపై వజహత్ ఖాన్ అనే వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. విద్వేషపూరిత ప్రసంగాలు చేసేవారికి అవి ఎంత అసభ్యకరంగా, అనుచితంగా ఉంటున్నాయో ఎందుకు అర్థం కావడం లేదని వ్యాఖ్యానించింది. ఇటువంటి వ్యాఖ్యలను షేర్ చేయకుండా కొన్ని నియంత్రణ చర్యలు చేపట్టవలసిన అవసరం ఉందని అభిప్రాయపడింది. ప్రజలు కూడా ఇటువంటి వాటిని షేర్ చేయకుండా సంయమనం పాటించాలని సూచించింది. ఇక్కడ సెన్సార్‌షిప్ గురించి మాట్లాడటం లేదని, కానీ ప్రజలు మాత్రం ఆత్మపరిశీలన చేసుకోవాలని పేర్కొంది. సామాజిక మాధ్యమాల్లో విభజన ధోరణిని అడ్డుకోవాలని వ్యాఖ్యానించింది. భావప్రకటనా స్వేచ్ఛపై బాధ్యతాయుతమైన ఆంక్షలు సరైనవేనని సుప్రీంకోర్టు పేర్కొంది. భావప్రకటనా స్వేచ్ఛకు భంగం కలగకుండా విద్వేషపూరిత ప్రసంగాలను నిలువరించే మార్గాలపై సలహాలు, సూచనలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను సుప్రీంకోర్టు కోరింది.

## గోవా గవర్నర్ గా అశోక్ గజపతిరాజు... రాష్ట్రపతి భవన్ ప్రకటన

- మొదటి పేజీ తరువాయి

కేంద్రం నియమించింది. ఈ నియామకాలు తక్షణమే అమలులోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ అధికారికంగా ప్రకటించింది.

విజయనగరానికి చెందిన అశోక్ గజపతి రాజు తెలుగుదేశం పార్టీ (టీడీపీ) సీనియర్ నాయకుడు మరియు పొలిట్ బ్యూరో సభ్యుడు. గతంలో ఆయన కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేశారు. రాజకీయంలో నాలుగు దశాబ్దాల అనుభవం ఉన్న ఆయన, విజయనగరం రాజవంశానికి చెందిన ప్రముఖ వ్యక్తి. ఆయన గోవా గవర్నర్‌గా నియమితులవడంపై టీడీపీ నాయకులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఇక, హర్యానా గవర్నర్‌గా ఇప్పటివరకు బండారు దత్తాత్రేయ సేవలందిస్తూ వచ్చారు. ఆయన స్థానంలో ప్రొఫెసర్ ఆషింకుమార్ ఘోష్‌ను కేంద్రం నియమించింది. విద్యారంగంలో ప్రముఖుడైన ఘోష్, ఈ కీలక పదవిని చేపట్టనున్నారు. అలాగే, లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా కవీందర్ గుప్తా నియమితులయ్యారు.

తెలుగు రాష్ట్రాల నుంచి గవర్నర్‌లుగా పనిచేసిన వారి సంఖ్య గణనీయంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు వివిధ రాష్ట్రాల్లో 20 మంది తెలుగు వారు గవర్నర్‌లుగా సేవలందించారు. వీరిలో ముఖ్యమంత్రులుగా పనిచేసిన ప్రముఖులు కూడా ఉన్నారు.

## ఏపీ డ్రోన్ మార్ట్ పోర్టల్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ఇలాంటి సేవలను పోర్టల్ ద్వారా సాధారణ రైతులు సైతం వినియోగించుకునే అవకాశాన్ని ప్రభుత్వం ఇప్పుడు అందరికీ కల్పిస్తోంది. అలాగే డ్రోన్లతో టెక్నాలజీని వినియోగించుకుని సర్వేలు చేపట్టడం, పెద్దఎత్తున పనులు చేపట్టే సందర్భంలో డ్రోన్లతో పర్యవేక్షించడం, సెక్యూరిటీ, మ్యాపింగ్ వంటి సేవలు డ్రోన్ల ద్వారా చేపట్టవచ్చు. ఈ తరహా సేవలను ఇకపై డ్రోన్ మార్ట్ ద్వారా పొందవచ్చు. డ్రోన్ మార్ట్ సేవలను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అందుబాటులోకి తెచ్చారు. డ్రోన్ సేవలు అవసరమైన వారికి సర్వీస్ ప్రొవైడర్లను డ్రోన్ మార్ట్ పోర్టల్ అందుబాటులోకి తెస్తుంది. ప్రభుత్వ విభాగాలను.. వివిధ సంస్థలను.. సర్వీస్ ప్రొవైడర్లను ఈ పోర్టల్ అనుసంధానం చేస్తుంది. సర్వీస్ ప్రొవైడర్లతో కస్టమర్లు సర్వీస్ ఛార్జీలపై సంప్రదింపులు

జరిపే అవకాశం ఉంటుంది. ప్రస్తుతం అందుబాటులోకి తెచ్చిన సేవలతో పాటు.. ఈ పోర్టల్ భవిష్యత్తులో ప్రజలకు మరిన్ని సేవలు అందించేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి సూచించారు. డ్రోన్ సేవలు సామాన్యులకు అందుబాటు ధరల్లో ఉండేలా చూస్తే.. మరింత ఆదరణ పెరుగుతుందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సీఎస్ విజయానంద్, ఐటీ శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## భారత్, చైనా సంబంధాలు ప్రపంచానికి మేలు చేస్తాయి

- మొదటి పేజీ తరువాయి

కీలక నిర్ణయాలు తీసుకోవాలని, మంచి ఫలితాలు రావాలని కోరుకున్నట్లు చెప్పారు.ఇరుదేశాల విదేశాంగ శాఖ మంత్రుల సమావేశంలో జైశంకర్ మాట్లాడుతూ, దూరదృష్టితో ఆలోచించి ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. అక్టోబర్ 2024లో మోదీ, జిన్‌పింగ్ సమావేశమయ్యారని, నాటి నుంచి సంబంధాలు సానుకూల దిశలో ముందుకు సాగుతున్నాయని అన్నారు. రెండు దేశాలు కూడా బాధ్యతాయుతంగా కొనసాగించాలని వ్యాఖ్యానించారు. క్రమం తప్పకుండా సమావేశాలు ఏర్పాటు చేసుకొని చర్చించుకుంటే రెండు దేశాలకు మేలు జరుగుతుందని అన్నారు. ఐదేళ్ల విరామం అనంతరం మానససరోవర్ యాత్ర పునఃప్రారంభమైందని, ఇందుకు చాలా సంతోషంగా ఉందని అన్నారు. ఇందుకు చైనాకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు ఏర్పడి ఈ ఏడాదితో 75 ఏళ్లు పూర్తవుతుందని పేర్కొన్నారు. ద్వైపాక్షిక సంబంధాల విషయంలో గత తొమ్మిది నెలల్లో కీలక పురోగతి సాధించామని, సరిహద్దు వెంబడి ఘర్షణ వాతావరణం లేకుండా చూసుకున్నామని ఆయన అన్నారు.ఆర్థికంగా రెండు బలమైన దేశాలు కలిసి ముందుకు వెళితే త్వరితగతిన అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందని జైశంకర్ అన్నారు. భారత్, చైనా సంబంధాలు ప్రపంచానికి కూడా మేలు చేస్తాయని అభిప్రాయపడ్డారు. రేపు జరగనున్న సమావేశంలో తీవ్రవాదం, ఉగ్రవాదం, వేర్పాటువాదం తదితర అంశాలపై చర్చ జరగాల్సి ఉందని అన్నారు. ఉగ్రవాదాన్ని అణిచివేయాలనే కృత నిశ్చయంతో భారత్ ఉందని జైశంకర్ అన్నారు. విదేశాంగ మంత్రిగా ఇరుదేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేయాల్సిన బాధ్యత వాంగ్ యీపై ఉందని అన్నారు.

## ర్యాంకర్లను సన్మానించిన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

- మొదటి పేజీ తరువాయి

జాతీయ స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించిన ఈ విద్యార్థులు రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు" అని సోషల్ మీడియా వేదికగా ప్రశంసించారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాధనను కొనియాడిన మంత్రి, రాష్ట్రంలోని ఇతర విద్యార్థులకు వారు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.

## పేర్ని నానీ నీకంత కొవ్వు పట్టిందా? వంశీ ఇలా మాట్లాడే ఊచలు లెక్కబెట్టి వచ్చాడు

- మొదటి పేజీ తరువాయి

రావడంతో రాష్ట్రంలో అన్ని వ్యవస్థలు గాడిన పడ్డాయి. కానీ వైసీపీ, జగన్ రెడ్డి దుర్మార్గపు ఆలోచనలు, చర్యల వలన రాజకీయాలు రోడ్డున పడుతున్నాయి. సినిమాల్లో రాజనాల కుట్రలు కుతంత్రాలు ఎలా ఉండేవో నేడు జగన్ రెడ్డి కుట్రలు అలా ఉంటున్నాయి. రాజకీయాల్లో విలువలు లేకుండా వైసీపీ నాయకులు మాట్లాడుతున్నారు. మాజీ మంత్రి పేర్ని నాని వాడే భాష ఏంటి? ప్రజలు ఛీ కొట్టినా ఇంకా సిగ్గు రాలేదా? ఒకప్పుడు ఇలా మాట్లాడే వల్లభనేని వంశీ జైలుకు పోయి ఊచలు లెక్కపెట్టి బ్రతుకు జీవుడా అంటూ బయటకి వచ్చాడు. జగన్ రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు శాసనసభలో ఏమి స్క్రిప్టు ఇస్తే అది మీరు చదవాలి. అలా రాసి చదవమంటే నేను చదవను అని మాగుంట శ్రీనివాసులు పక్కకి నెట్టేశాడు. ఈరోజు పేర్ని నానిలాంటి వారు జగన్ రెడ్డి రాసిచ్చిన స్క్రిప్టును చదివేస్తూ ఘోరంగా మాట్లాడుతున్నారు" అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

**చంద్రబాబు గారితో నువ్వు గాని, జగన్ రెడ్డి గాని నడవగలరా?**

"చంద్రబాబు గారికి 76 ఏళ్లు అంటూ అవహేళన చేస్తావా పేర్ని నాని? నీకు అంత కొవ్వు పట్టిందా? ఆయనతో పాటు రామతీర్థం, అలిపిరి కొండ ఎక్కగలవా? అలిపిరి బాంబ్ బ్లాస్ట్ లో చావును చూసి తిరిగొచ్చి హీరోగా నిలిబడిన వ్యక్తి చంద్రబాబు గారు. మీ రాజ్యంలోనే అనపర్తిలో పోలీసులు చంద్రబాబు గారిని నిలువరిస్తే 7 కి.మీ నడిచారు. నాడు ఆయనతో పాటు పోలీసుల నడవలేకపోయారు. చంద్రబాబు పేరు చెబితేనే వణుకు వచ్చే వ్యక్తి పేర్ని నాని. ఏ ఫైలు మీదనైనా సంతకం పెట్టాలంటే పేర్ని నానికి చెయ్యి వణుకుతుంది. 40 ఏళ్లు రాగానే నాపని అయిపోయింది, నా కొడుకును పెట్టుకుంటానని తప్పించుకున్న నువ్వు చంద్రబాబు గారి గురించి మాట్లాడుతావా? సబ్జెక్ట్ పరంగా గాని, విజన్ పరంగా గాని ఎలా చూసుకున్న చంద్రబాబు గారి ప్రక్కన జగన్ రెడ్డి ఒక్క నిమిషం కూడా కూర్చోలేడు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ గారిని, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ గారిని ఒరే తురే అంటావా? నోరు అదుపులో పెట్టుకో!" అని హెచ్చరించారు.

**రప్పా రప్పా అంటూ సినిమా తీయండి**

"నాడు వల్లభనేని వంశీ, కొడాలి నాని... నేడు పేర్ని నాని, ప్రసన్న కుమార్ రెడ్డిలకు ఏమైంది? రాష్ట్రాన్ని అరాచకరాజ్యంగా మార్చాలని వైసీపీ చూస్తుంది. గంగమ్మ తిరునాళ్ళలో పొట్టేలు తలలు నరికినట్లు రప్పా రప్పా నరకాలా అని ప్లేకార్డులు ప్రదర్శిస్తే తప్పేంటని జగన్ రెడ్డి మాట్లాడాడు. వైసీపీ ఆలోచనలు ఏంటో రప్పా రప్పా అని బూతుల డైరెక్టర్ రాంగోపాల్ వర్మచేత సినిమా తీయించండి. రాజకీయాల్లో పేర్ని నాని లాంటి వారిని చూసి మేము రాజకీయాల్లో ఉన్నామని చెప్పుకోవడానికే సిగ్గుపడాల్సి వస్తుంది. రాజకీయ నాయకులు అంటే ప్రజలకు దురభిప్రాయాన్ని ఏర్పడేడట్లు వైసీపీ చేసింది. అన్నపూర్ణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంతోమంది మహానేతలు రాష్ట్రపతి, ప్రధానులు అయ్యారు. అలాంటి రాష్ట్రంలో జగన్ మోహన్ రెడ్డిలాంటి రాజకీయ ఉన్మాదులను చూస్తుంటే నవ్వాలో ఏడవాల్లో తెలయడం లేదు. కొడాలి నాని, వల్లభనేని వంశీ అంతపెద్ద హీరోలు అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎక్కడికి పోయి దాక్కున్నారు?" అని ప్రశ్నించారు.

**దేశ ప్రధానికే చంద్రబాబు ఆదర్శంగా నిలిచారు**

చంద్రబాబు ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. పక్క రాష్ట్రాలు చంద్రబాబు గారి విజన్‌ను చూసి నేర్చుకుంటున్నాయి. సాక్షాత్ దేశ ప్రధానే చంద్రబాబు చేస్తున్న ఐటీ అభివృద్ధిని చూసి నేను గుజరాత్‌లో అమలు చేశాను అని అన్నారు. జగన్ రెడ్డి ఏమి చేశాడో ఒక్కటి చెప్పండి. ఏదైనా ఉందా అంటే బాబాయిని చంపడం, తల్లి చెల్లిని గెంటేయడం, ఇంకో చెల్లి నా తండ్రిని చంపిన వారి పేర్లన్నీ ఉన్నాయి అరెస్ట్ చేయండని కోర్టు చుట్టు తిరగడం. ఇటువంటి రక్త చరిత్ర ఉన్నవ్యక్తి దేశంలో ముఖ్యమంత్రిగా చేసిన వారి చరిత్రలో జగన్ రెడ్డి తప్పించి మరెవ్వరూ లేరు. కుటుంబాలపై మాటల దాడి చేస్తుంటారు. మా తల్లిదండ్రులపై కాకాణి గోవర్ధన్ రెడ్డి, చంద్రబాబు గారి కుటుంబంపై వల్లభనేని వంశి దూషించారు. ఇటువంటి వ్యక్తులను పార్టీలో పెట్టుకొని రాజకీయాలను, వ్యవస్థలను భ్రష్టు పట్టించిన వ్యక్తి జగన్ రెడ్డి. వెంటనే ఈ విషయంలో జగన్ రెడ్డి కలగజేసుకొని పేర్ని నాని చేత క్షమాపణలు చెప్పకపోతే వైసీపీ అనే పార్టీ తుడుచుపెట్టుకుపోతది. పద్ధతిగా ఉండి క్షమాపణలు చెప్పండి" అని డిమాండ్ చేశారు.

**కూటమి ప్రభుత్వంలో రాజకీయ కక్షలు లేవు... తప్పు చేస్తే శిక్ష తప్పుదు**

చట్టం తనపని తాను రాజ్యాంగబద్ధంగా చేసుకుంటూపోతుంది. ఎటువంటి రాజకీయా కక్షలు మేము చేయడం లేదు. రాజకీయ విరుధిని అరెస్ట్ చేయాలనే మనస్తత్వం ఉన్న వ్యక్తి చంద్రబాబు గారు కాదు. తప్పు చేసిన ప్రతి ఒక్కడు ఎంత స్థాయిలో ఉన్న చట్టం ముందు నించుపెడుతున్నాం. వారు శిక్ష అనుభవించడం తప్పదు. అది ప్రశన్నకుమార్ రెడ్డి అయినా, వల్లభనేని వంశి అయినా. వైసీపీ నాయకులు వారంతట వారే రొచ్చుగుంటలో దిగి ఏదిపడితే అది మాట్లాడుతూ జైలుకు పోయే పరిస్థితిని తెచ్చుకుంటున్నారు. ఒక మనిషిని నిన్ను చంపేస్తే దిక్కెవరు అనడం సెక్షన్ 307 కింద వచ్చినప్పుడు, రాత్రికి వేసేసి పగలు పరామర్శించండి అని పేర్ని నాని అన్న వ్యాఖ్యలు 307 సెక్షన్ కింద రాదా? ఇప్పుడు పేర్ని నానిని వదిలేస్తే అదే బాటలు మిగిలిన వైసీపీ నాయకులు కూడా మాట్లాడతారు" అని సోమిరెడ్డి ధ్వజమెత్తారు.

పెన్ పవర్ ప్రకాశం

# ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఎప్పటికప్పుడు చర్యలు

## - మంత్రి గొట్టిపాటి రవికుమార్











**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 14**

ప్రజల అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. కనిగిరిలో 70 సెంట్ల విస్తీర్ణంలో రూ.3.80 కోట్ల వ్యయంతో 33/11 కె.వి. విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి సోమవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మాత్యులు డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి, స్థానిక శాసన సభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మార్కాపురం శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా మంత్రి రవికుమార్ మాట్లాడుతూ నాలుగైదు నెలల్లోనే ఈ స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేస్తామని చెప్పారు. దీనివలన కనిగిరి పట్టణంతో పాటు పునుగోడు పారిశ్రామిక ప్రాంతంలో లోవోల్టేజి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ఇప్పటివరకూ 12 సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు. ప్రజలపై ఎలాంటి అదనపు భారం మోపకుండా వారి అవసరాలకు తగినట్లుగా నాణ్యమైన విద్యుత్తును సరఫరా చేసేలా ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. విద్యుత్ లోడ్ ఆధారంగా సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రాష్ట్రంలో 70 వేలకు పైగా వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు ఇచ్చామన్నారు. సౌర విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించేలా పి.ఎం.సూర్యాఘర్ పథకంలో భాగంగా ప్రతి నియోజకవర్గంలో పదివేల సోలార్ విద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈప్రక్రియ కూడా వేగంగా జరుగుతున్నట్లు తెలిపారు. కరెంటు సరఫరాలో నష్టాలను తగ్గించేందుకు సబ్ స్టేషన్ల సమీపంలో పి.ఎం.కుసుమ్ పథకంలో భాగంగా కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి ప్రాధాన్యమిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏపీ సిపిడిసిఎల్ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, ఆర్డిఓ కేశవర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ గఫూర్, జడ్పిటిసి కస్తూరి రెడ్డి, ఎంపీపీ దంతులూరి ప్రకాశం, స్థానిక అధికారులు, ప్రజా పతినిధులు తదితరులు పాల్గొన్నారు.





# చాలీచాలని భోజనం...

# ఆకలితో అలమటిస్తున్న విద్యార్థులు

### జడ్ పి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలిపై చర్యలు తీసుకోవాలి - విద్యా కమిటీ ఛైర్మన్ నాగూర్ ఖాన్



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 14**

విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెను సక్రమంగా అమలు చేయని మార్కాపురం జడ్ పి బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి పై ఉన్నతాధికారులు చర్యలు తీసుకువాలని పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్ నాగూర్ ఖాన్ కోరారు.స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ నాగూర్ ఖాన్ సోమవారం సందర్శించి రికార్డు లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పాఠశాలలో 802 మందికి మధ్యాహ్న భోజనం వండటానికి120 కిలోల బియ్యం ఇవ్వాలని కానీ కేవలం 70 కిలోల బియ్యం మాత్రమే ఇచ్చారని తెలిపారు.గుడ్లు కూడా450 మాత్రమే ఇచ్చారని అన్నారు. రికార్డు లు పరిశీలిస్తే 120 కిలోల బియ్యం 450 గుడ్లు ఇచ్చినట్లు రికార్డు లో రాసారని తెలిపారు.తనముందే రికార్డు లు తారుమారు చేసినట్లు వెల్లడించారు. పాఠశాలలో ఆర్ఓ ప్లాంట్ పనిచేయడం లేదని దీంతో విద్యార్థులు పాచిపట్టిన వాటర్ ట్యాంక్ నీళ్ళు తాగి వ్యాధులకు గురవుతున్నారు అని అన్నారు. పదవతరగతి పాసైన విద్యార్థులు నుంచి 500 రూపాయలు బలవంతంగా వసూలు చేసారని అని చెప్పారు. బియ్యం.గుడ్లు బయట అమ్ముకుంటూ విద్యార్థల కడుపు కొట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఈ ప్రధానోపాధ్యాయురాలు పై అధికారుల విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.

## బర్లీ కొనుగోలులో సన్న,చిన్నకారు

# రైతులకు తొలి ప్రాధాన్యం

- వచ్చే సోమవారం నుంచి కొత్త కొనుగోలు విధానం
- 20 క్వింటాళ్ల లోపు రైతు ఉత్పత్తులు ముందుగా కొనుగోలు
- మరిన్ని నూతన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు - ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు



**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 14**

బర్లీ పొగాకు కొనుగోలులో సన్న చిన్న కారు రైతులకు తొలి ప్రాధాన్యత ఇస్తామని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా లామ్ మండలంలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో సమావేశ మందిరములో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు వ్యవసాయ ప్రత్యేక కార్యదర్శి, ఇతర ప్రభుత్వ ఉన్నతాధికారులు ,రైతులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలూరి మాట్లాడుతూ ప్రతి రైతు పొగాకు కొనుగోలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. పొగాకు కొనుగోలు ప్రక్రియను మరింత వేగవంతం చేసేందుకు గౌడన్ల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్నామన్నారు. మరిన్ని నూతన కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం చిన్న సన్న కారు రైతులకు ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతన కొనుగోలు చేసేలా ఆదేశాలు జారీ చేశామన్నారు. కంపెనీలు సైతం కొనుగోలు చేసేలా ఒత్తిడి తీసుకురావాలన్నారు. 20 క్వింటాళ్ల లోపు రైతులకు తొలి ప్రాధాన్యత ఇచ్చి తర్వాత 20 క్వింటాళ్ల సరకు పై బడి వున్న రైతుల కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. పెద్ద రైతులకు కూడా సమాంతరంగా తేదీలను ఖరారు చేయాలని సూచించారు.గ్రామీణ ప్రాంతాల్లో గోడౌనులు నిండుకున్న పరిస్థితులలో రైతులు అనవసర భయాలకు గురికావద్దని ప్రభుత్వమే పూర్తి రవాణాను భరించి స్థానికంగా కొత్త గోడౌన్లకు పొగాకు సరుకును చేరుస్తుందని తెలిపారు. సన్న చిన్నకారు రైతులకు కొనుగోలులో అత్యంత ప్రాధాన్యం ఇచ్చే విధముగా ప్రభుత్వం రాబోవు సోమవారం 21/07/25 నుండి ఒకటి నుండి ఇరవై క్వింటాళ్ల పొగాకు ఉత్పత్తి వరకు నాణ్యత ప్రమాణాలకు అనుగుణముగా కొనుగోలు చేస్తున్నదని తెలిపారు.ఈ కార్యక్రమంలో గొట్టిపాటి రవికుమార్ ఇంధన శాఖ మంత్రి వర్చువల్ గా పాల్గొనగా శాసన సభ్యులు పత్తిపాటి పుల్లారావు ,రామాంజనేయులు పాల్గొన్నారు. వ్యవసాయ ప్రత్యేక కార్యదర్శి రాజశేఖర్, వ్యవసాయ సంచాలకులు డిల్లీ రావు, మార్కెటింగ్ కమిషనర్ సునీత ,పొగాకు బోర్డు కార్యదర్శి ,పల్నాడు జిల్లా కలెక్టర్,ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్ లు ,ఇతర అధికారులు రైతులు పాల్గొన్నారు.



# కుటుంబ సాధికార సారధులు ఎంతో కీలకం

### - మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయ స్వామి

### - పార్టీ బలోపేతంలో కీలక పాత్ర



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 14**

తెలుగుదేశం పార్టీలో కుటుంబ సాధికార సారధులు ( కెఎస్ఎస్) ఎంతో కీలకమైన స్థానం కలిగి ఉన్నారని, పార్టీ కార్యక్రమాలను చురుగ్గా చేపట్టి ప్రజల్లోకి తీసుకువెళ్ళాలని రాష్ట్ర మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా బాల వీరాంజనేయస్వామి అన్నారు. సోమవారం స్థానిక అమరావతి గ్రౌండ్స్ లో ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశంలో క్లస్టర్, యూనిట్, బూత్, కెఎస్ఎస్ సభ్యులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ మాట్లాడుతూ "సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం ప్రతి బూత్ వద్ద ప్రతిరోజూ కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. బూత్ ఇన్‌చార్జ్‌లు, కెఎస్ఎస్ సభ్యులు నిర్దేశిత లక్ష్యాలను అదే రోజు పూర్తిచేయాలని అన్నారు. ప్రతి కుటుంబానికి చేరి, అభివృద్ధి, సంక్షేమంపై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి మాట్లాడుతూ భవిష్యత్తులో కెఎస్ఎస్ సభ్యులుకు పార్టీలో తగిన గుర్తింపు లభిస్తుంది. ప్రజలకు మంచి చేసే నాయకుడు నారా చంద్రబాబు నాయుడు అయితే, కీడు చేసే నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఆరోపించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలిపిన వ్యక్తి చంద్రబాబు నాయుడు అని, రాష్ట్రాన్ని అప్పుల్లో కూర్చేసి వెనకడుగు వేసేలా జగన్ పాలన అని విమర్శించారు. ప్రతి బూత్ లో సుపరిపలనలో తొలిఅడుగు మరింత వేగవంతం చేయాలి. కుటుంబ సాధికార సారధులు ప్రజలతో నిత్యం మమేకం కావాలి. పార్టీ విజయమే లక్ష్యం అని అన్నారు. కనిగిరి నియోజకవర్గ అభివృద్ధి పథంలో వేగంగా దూసుకుపోతుందని, నియోజకవర్గం ఎమ్మెల్యే డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వం ప్రస్తావిస్తూ మంత్రులు ప్రశంసించారు. కార్యక్రమంలో మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఆయా మండల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్, కెఎస్ఎస్ సభ్యులు పాల్గొన్నారు.



# మధ్యవర్తిత్వంపై అవగాహన అవసరం -జడ్జి బి. రూపశ్రీ



కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జూలై 14

మధ్యవర్తిత్వంపై న్యాయవాదులు, పోలీస్ లు, పారా లీగల్ వాలంటీర్లు, ప్రజలు అవగాహన కలిగిఉండాలని కనిగిరి మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ బి. రూపశ్రీ కోరారు. రాష్ట్ర, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు దేశం కోసం మధ్యవర్తిత్వంపై ఈ నెల 10వ తేది నుండి 16వ తేది వరకు ఒక వారం అవగాహన ప్రచారం సందర్భంగా సోమవారం కనిగిరి కోర్టు ప్రాంగణంలో మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మధ్యవర్తిత్వంపాత్ర, వాటివల్ల కలిగే ప్రయోజనాలు, ఆవశ్యకత వంటిఅంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, పోలీస్ సిబ్బంది, పారా లీగల్ వాలంటీర్లు, వివిధ బ్యాంక్ ల ప్రతినిధులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ



సి ఎస్ పురం,పెన్ పవర్ జూలై 14

మండలంలోని చింతపూడి నాగులవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కోమటిగుంట్ల గ్రామంనకు చెందిన 2007-08 సంవత్సరంలో 10 వ తరగతి ఇదే పాఠశాలలో చదివి మొదటి స్థానం సాధించిన పూర్వ విద్యార్థి బెల్లంకొండ ఖాజా మస్తాన్ సతీమణి నాగూర్ బీ విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు బూదాల డేవిడ్ ఆధ్వర్యంలో జామెంట్రీ బాక్స్, నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్ మరియు రైటింగ్ ప్యాడ్ మొదలైన సామాగ్రిని పంపిణీ చేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాఠశాలలో చదివిన జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ స్టడీ మెటీరియల్ పంపిణీ చేసిన ఖాజా మస్తాన్ ను అభినందించారు ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి డేవిడ్, ఉపాధ్యాయులు కిరణ్, మాజీ సర్పంచ్ గుంటిమడుగు శ్రీనివాసులు, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మైలుచర్ల గ్రామంలో సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమం

### అర్హులందరికీ సంక్షేమ ఫలాలు దొరా తిరుపతయ్య



సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 14

మండల పరిధిలోని మైలుచర్ల గ్రామంలో కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశాల మేరకు మండల టిడిపి అధ్యక్షులు డాక్టర్ బొమ్మనబోయిన వెంకటేశ్వర్లు సూచనల మేరకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా దొరా తిరుపతయ్య ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు జరుగుతున్న విధానం గురించి ప్రజలకు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికి అందిస్తూ రాష్ట్రంలో సుపరిపాలన అందించే దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పనిచేస్తున్నారని కూటమి ప్రభుత్వంలో మాత్రమే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఆకుపాటి

పామూరు, పెన్ పవర్, జూలై14

ప్రకాశం జిల్లా ఎంపీటీసీల సంఘం అధ్యక్షులు ఆకుపాటి వెంకటేష్ సోమవారం ఉదయం విజయవాడ ఇంద్రకీలాద్రి క్షేత్రం కు విచ్చేసి కనక దుర్గమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుపాటి కి స్వాగతం పలికి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం వేద పండితులు వేద ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం, అమ్మవారి ప్రసాదములు ఆకుపాటి వెంకటేష్ కు అందజేశారు.



### మున్సిపాలిటి లో పలు ప్రాంతాల్లో

# అభివృద్ధి పనులు పరిశీలించిన కమీషనర్








**పారిశుధ్యం పైనే ప్రత్యేక దృష్టి**

**వ్యాపారస్తులు , ప్రజలు సహకరించాలి**

**ఇది ప్రభుత్వం , ప్రజల సమిష్టి కృషి**

**వ్యాపారస్తులు , ప్రజల సంపూర్ణ సహకారం ఇవ్వాలి**

**ఇది మన పని కాదు ,**

**ఎవరో వస్తారు చేస్తారని అనుకోవటం సరి కాదు**

గిద్దలూరు పెన్ పవర్ జూలై 14

మున్సిపల్ కమిషనర్ ఈ వి రమణ బాబు సోమవారం నాడు పలు అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయన ఎక్కడికెళ్లినా పని నాణ్యతను, పారిశుధ్యం పైనే ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. సోమవారం సగిలేరు సప్టె ఛానల్ లో పూడికతీత పనులను పరిశీలించారు. ఈపూడికలో ఎక్కువ శాతం ప్లాస్టిక్ వ్యర్థాలు , ఇండ్లలో ఉత్పత్తి అయే పాతవ్యర్థాలు కన్పిస్తుండటంతో అవాక్కయ్యారు. సప్టె ఛానల్లో ఇలా వ్యర్థాలను వేయటం ఏమిటని అవాక్కయ్యారు. ఇంకా అనేక వార్డుల్లో పర్యటించారు. పారిశుధ్యం పై వ్యాపారస్తులకు , ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో ప్రాధానంగా వ్యాపారస్తులు తమ షాపుల్లోని వ్యర్థాలను డ్రైనేజి , సైడ్ కాలువల్లో వేయటం వలన డ్రైనేజి వ్యవస్థ లో పూడిక వ్యర్థాలు చేరి మురుగునీటి ప్రవాహానికి ఆటంకం ఏర్పడుతుందన్నారు. టీ షాపులో కాగితం గ్లాసులు, వెచ్చలా దుకాణంలో ఉల్లి, వెల్లుల్లి పొట్టు లను షాపుల్లోని ఇతర వ్యర్థాలను సైడ్ కాలువల్లో వేయటం అలవాటు అయిందని , ఫలితంగా అనేక ఇబ్బందులు, ఏర్పడు తున్నాయని కమీషనర్ తెలిపారు . వ్యాపారస్తులు షాప్ ముందు డస్టుబిన్ లను ఏర్పాటు చేసుకొని చెత్త సేకరించే కార్మికులకు అందజేయాలని కోరారు. ఈవిషయంలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇదిమన పనికాదు ఎవరోవచ్చి చేయాలని అనుకోవటం సరిందికాదన్నారు. ప్రభుత్వం, ప్రజల సమిష్టి కృషితోనే పారిశుధ్యం మెరుగు పడి పట్టణం సుదరంగా తయ్యారవుతుందన్నారు. ఏ వ్యర్థాలను అయినా సైడ్ కాలువలో వేయకుండా మున్సిపాలిటి చెత్త సేకరించే కార్మికుల కు అందజేయాలని కమిషనర్ కోరారు. సమిష్టిగాకృషి చేసి మున్సిపాలిటీని సుందరంగా తీర్చిదిద్దుకుందామన్నారు. ఇక కమీషనర్ రమణ బాబు మున్సిపాలిటి లోని కొత్తపల్లి, పట్టణంలో ని టీచర్స్ కాలనీ పలుప్రాంతాలో అభివృద్ధి పనులను పరిశీలించారు. మున్సిపాలిటీలో జరిగే ఏ అభివృద్ధి పనిలోనైనా నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. మున్సిపాలిటీలో వ్యారస్తుల అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులతో, సమావేశం నిర్వహించి పారిశుధ్యం పై అవగాహన కల్పిస్తామని రమణ బాబు తెలిపారు. నిత్యం ప్రజలు తడి, పొడి చెత్తపై అవగాహన కల్పిస్తున్నామని అయినా ఇంకా వారి సహకారం అవసరమన్నారు. పారిశుధ్యం విషయంలో తమ కార్మికులు నిర్విరామంగా పనిచేస్తున్నారని కార్మికులకు కితాబిచ్చారు. ఏదైనా పారిశుధ్యం పై ప్రజలు సంపూర్ణ సహకారాన్ని అందించాలని కోరారు.

### అర్ధాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహాల ను

# త్వరితగతిన పూర్తి చేసుకోవాలి

**పక్క గృహాల నిర్మాణాలకు ఉత్సాహం చూపే లబ్ధిదారులకు అదనంగా 50 వేల రూపాయలు మంజూరు.**

**కొమరోలు మండలంలో అర్ధాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహాలను పరిశీలించి, లబ్ధిదారులకు సూచనలు సలహాలు ఇచ్చిన గిద్దలూరు హౌసింగ్ డిఈఈ షేక్ ఖదీర్ భాష.**

కొమరోలు పెన్ పవర్ జూలై 14

కొమరోలు మండలానికి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ద్వారా మంజూరై అర్ధాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహాలను గిద్దలూరు హౌసింగ్ డిఈఈ షేక్ ఖదీర్ భాష సోమవారం సందర్శించి లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కొమరోలు మండలంలోని వివిధ లేఔట్లలో 313 పక్కా గృహాల నిర్మాణాల పురోగతిని పరిశీలించామని ఖదీర్ భాష తెలిపారు. వాటిల్లో బేస్మెంట్ లెవెల్ లో 157గృహాలు, లింటల్ లెవెల్లో 64, రూఫ్ లెవెల్లో33 గృహాల నిర్మాణాలు నిలిచిపోయినట్లుగా ఆయన తెలిపారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన పక్కా గృహల నిర్మాణాలను కొనసాగించి పూర్తిచేసుకునే లబ్ధిదారులకు 50 వేల రూపాయలు ఏ ఎఫ్ ఏ అమౌంట్ లభిస్తుందని ఆయన లబ్ధిదారులకు తెలిపారు. అంతేకాక పక్కా గృహల నిర్మాణాలకు అవసరమైన సిమెంటు ,ఇనుము, ఇసుక సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నదని, కావున లబ్ధిదారులు నిర్లక్ష్యం చేయకుండా అర్ధాంతరంగా నిలిచిపోయిన పక్క గృహల నిర్మాణాలను కొనసాగించి వాటిని పూర్తిచేసుకుని సొంతింటి కలను సాకారం చేసుకోవడంతో పాటు, ప్రభుత్వ ఆశయాన్ని నెరవేర్చాలని ఆయన



లబ్ధిదారులను కోరారు. ఆ సందర్భంగా లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. కాగా కొమరోలు లేఅవుట్ లోని లబ్ధిదారులతోపాటు, గోపాలపల్లి లోని ఒక ఇంటి లబ్ధిదారునికి మోటివేషన్ చేశారు. ఆ కార్యక్రమంలో కొమరోలు హౌసింగ్ ఏఈ జి కృష్ణారెడ్డి, సచివాలయాల సిబ్బంది ,ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# నారాయణస్వామి ఆరాధన మహోత్సవాలకు దారపనేని సౌజన్యంతో వడ్లమూడి భారీ విరాళం



పామూరు, పెన్ పవర్,జూలై14

సిఎస్ పురం మండలంలో ప్రసిద్ధి చెందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో ఈ నెల 17వ తేదీన గురువారం జరుగుతున్న ఆరాధన మహోత్సవా కార్యక్రమనికి కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ సౌజన్యంతో వడ్లమూడి నాగేశ్వరరావు, అండ్ సన్స్ వడ్లమూడి నాగేంద్రబాబు, లక్ష్మీ శిరీష దంపతుల విద్యుత్ అలంకరణ, వడ్లమూడి నాగార్జున ఆర్థిక సహాయంతో పుష్పాలంకరణకు ఆరాధన మహోత్సవంలో విచ్చేయుచున్న భక్తులకు 1,01,116 రూపాయలతో స్వామివారికి ప్రత్యేక అలంకరణ మరియు ఆలయంలో సొంత నిధులతో గర్భగుడిలో పుష్పాలంకరణ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణ అధికారి శ్రీ గిరిరాజు నరసింహరాజు దేవస్థాన చైర్మన్ కొమ్మినేని చిన్న ఆదినారాయణ, కొమ్మినేని వెంకటరావు, కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ కు, రెడ్డిగారి కొత్తపల్లె మాజీ సర్పంచ్ చావా సుబ్బయ్యకు ఘనంగా స్వామివారి తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు.

# మధ్యవర్తిత్వంతో సమస్యల పరిష్కారం సులభం

### న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఇబ్రహీం షరీఫ్




క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జూలై 14

మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం వలన ఇరువర్గాలు గెలిచినట్టే భావించబడతాయని ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని కక్షిదారులు ఇరువురు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి షేక్ ఇబ్రహీం షరీఫ్ అన్నారు. న్యాయస్థానాల్లో పెండింగ్లో ఉన్న వ్యాఖ్యల పరిష్కారం నిమిత్తం జాతీయ న్యాయ సేవాధికార సంస్థ వారి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న మీడియేషన్ ఫర్ నేషన్ కార్యక్రమంలో సోమవారం బార్ అసోసియేషన్ నందు కార్యక్రమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో మధ్యవర్తిత్వం మీద శిక్షణ పొందిన న్యాయవాదులు చిట్టెం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తమకు ఇచ్చిన శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందని కక్షిదారుల మధ్య మధ్యవర్తిత్వం చేసి వ్యాజ్యాల పరిష్కారానికి ఎంతో సహకరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ పొందిన మీడియేటర్స్ నల్లూరి సత్య శ్రీనివాసులు, పి.సంజీవరెడ్డి, నాయుడు ఈశ్వరరావు, అయినా బత్తిని సుబ్బారావు మాట్లాడుతూ ఈ కార్యక్రమం వలన కక్షిదారులకు సమయము మరియు డబ్బు ఆదా అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బొడ్డు భాస్కరరావు మరియు ఇతర న్యాయవాదులు పాల్గొన్నారు.

# మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తికి 45 రోజులు జైలు శిక్ష

గిద్దలూరు పెన్ పవర్ జూలై 14

కంభం మండలంలో లైసెన్సు లేకుండా మద్యం తాగి ద్విచక్ర వాహనం నడిపిన వ్యక్తికి గిద్దలూరు కోర్టు 45 రోజులు జైలు శిక్ష రూ.15 వేలు జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు ఇచ్చింది. మద్యం తాగి వాహనం నడుపుతున్న సమయంలో పోలీసులు డ్రంకన్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించి మద్యం తాగిన వ్యక్తిని కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయమూర్తి భరత్ చంద్ర నిందితుడికి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పించారు.




# దాతల సహకారంతో పలకలు, కాపీ నోట్ పుస్తకాల పంపిణీ



సి ఎస్ పురం, పెన్ పవర్ జూలై 14

మండలంలోని ముండ్లపాడు మండల ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల శ్రేయస్సు కోసం దాత గుడిపాటి లక్ష్మిరెడ్డి కుమారుడు వెంకటరెడ్డి సహకారంతో పలకలు, కాపీనోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెన్నయ్య మాట్లాడుతూ దాతల సహకారాన్ని కొనియాడుతూ విద్యార్థులు ఒక అందించిన స్టడీ మెటీరియల్ విద్యాభివృద్ధికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు పాఠశాల అభివృద్ధికి దాతలు సహకారం కొనసాగించాలని కోరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ విద్యార్థులు తల్లిదండ్రులు తల్లిదండ్రుల ఆశయ సాధన కోసం కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో దాతలు గుడిపాటి లక్ష్మిరెడ్డి మరియు కుమారుడు వెంకటరెడ్డి, గుడిపాటి రామిరెడ్డి,పులి వెంకట నారాయణరెడ్డి, వెంకటరెడ్డి,బుట్టిరెడ్డి, మస్తాన్, వెలుగొండరెడ్డి, శ్రీను, పరిపూర్ణాచారి, మాదిరెడ్డికోటిరెడ్డి, బుట్టిరెడ్డి యర్రారెడ్డి, దర్శి వెంకట రాజా,తోట లక్ష్మి నారాయణ మరియు గ్రామస్థులు, పాఠశాల ఉపాధ్యాయులు చెన్నయ్య,గాంధీ,రామకృష్ణ మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్య సభ్యులకు శిక్షణా కార్యక్రమం

## లావాదేవీల నిర్వాహన ప్రత్యేక శ్రద్ధ చూపాలి





**సి ఎస్ పురం, పెన్ పవర్ జులై 14**

సమాఖ్య నిధులు లావాదేవీల నిర్వాహణపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని రాష్ట్ర సీఆర్పీలు పి. మోబినా, జి. ఈశ్వరి అన్నారు మండల కేంద్రంలో వెలుగు ఆఫీసులో సభ్యులకు సోమవారం సిఎస్పురం, పామూరు, కనిగిరి మండలాల గ్రామ సంఘాలు మరియు మండల సమాఖ్య సభ్యులకు శిక్షణా తరగతులను నిర్వహించారు ఈ సందర్భంగా స్టేట్ సిఆర్పిలు పి.మోబినా, జి.ఈశ్వరి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులు రెండు రోజులపాటు కొనసాగుతాయని మహిళా సమాఖ్య సభ్యులు ప్రతి నెల సమావేశం నిర్వహించి, జమ ఖర్చులు లెక్కలు చదవడం, సభ్యుల యొక్క ఆర్థిక లావాదేవీలను నోట్ బుక్ లో రాసి నమోదు చేయాలని, కొన్నిసార్లు లావాదేవీలను సరిగ్గా నింపకపోవడంలో వల్ల సమస్యలు తలెత్తుతాయని అన్నారు సమస్యలు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు సామఖ్య నిధులు వాడకం, రుణాలు ఇవ్వడం, వడ్డీలు వసూలు చేయడం, బ్యాంకులో చెల్లింపులు రసీదులు, రికార్డులు వివిధ సమస్యలపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ శిక్షణ కార్యక్రమంలో స్టేట్ సిఆర్పిలు పి మోబినా, జి ఈశ్వరి, ఎలక్ట్రానిక్ మాస్టర్ ట్రైనీర్స్ మరియు ఏటీఎం లు ఎం లక్ష్మీనారాయణ, జి విద్యాసాగర్, అశోక్ మరియు మూడు మండలాల సీసీలు, అకౌంటెంట్ లు, వివోఏలు హాజరైనారు.

## విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలి

### రాష్ట్ర మంత్రి బాల వీరాంజనేయ స్వామి





**పొదిలి, పెన్ పవర్, జూలై 14**

విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయ స్వామి చెప్పారు సోమవారం నాడు పొదిలి పట్టణంలోని ఎస్సీ హాస్టల్ ను ఆయన ఆకస్మిక తనిఖీ జరిపారు ఈ సందర్భంగా హాస్టల్ పరిసరాలను మంత్రి వీరాంజనేయ స్వామి క్షుణ్ణంగా పరిశీలించారు అలాగే హాస్టల్ విద్యార్థుల తో మాట్లాడుతూ మెనూ, వసతి సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు విద్యార్థులకు చక్కటి విద్యతోపాటు, నాణ్యమైన భోజన సౌకర్యం కల్పించాల్సిందిగా ఆయన హాస్టల్ వార్డెన్ లను ఆదేశించారు వసతిగృహాల్లోని విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలిగి నా, సంబంధిత అధికారులపై చర్యలు తప్పవని మంత్రి బాల వీరాంజనేయ స్వామి హెచ్చరించారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాలన్నదే చంద్రన్న ఆశయం



**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, జులై 14**

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలన్నదే రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆశయమని పట్టణ 17వ వార్డు బూత్ కన్వీనర్ పైడిమర్రి శ్రీనివాసులు అన్నారు. సోమవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 17 వ వార్డులో ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా పైడిమర్రి శ్రీనివాసులు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందన్నారు. రాష్ట్రంలో విద్యకు ప్రాధాన్యత ఇస్తూ తల్లికి వందనం పథకం పేరుతో ఇంటిలో చదువుకుంటున్న ప్రతి విద్యార్థికి రూ. 13వేలు చెల్లించిందన్నారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధి కోసం కోట్లాది రూపాయలు ప్రభుత్వం ఖర్చు చేస్తుందని అన్నారు. రాష్ట్రంలో యువతకు లక్షలాది ఉద్యోగ కల్పనే ఆశయంగా కూటమి ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని అన్నారు. కనిగిరి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలన్నదే శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ వివిఆర్ మనోహర్రావు, ఐ వి నారాయణ, బొగ్గరపు శీను, కెవిఎస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# హరిబాబు యాదవ్ ఆద్వర్యంలో సుపరిపాలన కరపత్రాలు పంపిణి





**మార్కాపురం ఆర్.సి ఇంచార్జ్ పెన్ పవర్ జూలై 14**

సుపరిపాలన తొలి అడుగు లో బాగంగా స్థానిక 16 వార్డులోని భగత్ సింగ్ కాలనీలో వార్డు అధ్యక్షుడు దనంకుల హరిబాబు యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిలో సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. పథకాలు అందని వారికి వెంటనే ఆన్లైన్ చేసి అందేట్టు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమం కొరకే పని చేస్తుందని తెలిపారు. మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి నాయకత్వంలో వార్డ్ లో ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడమే లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం తెలుగుదేశం పార్టీ 16వ వార్డు ఉపాధ్యక్షులు పంట సుబ్బారావు, కొమెర ఏడుకొండలు, ఆచారి శ్రీను, గోమసాని చిన్న వెంకటేశ్వర్లు పంటావెంకట సుబ్బయ్య నల్లబోతుల యోగయ్య తదితర తెలుగుదేశం పార్టీ కమిటి నాయకులు కార్యకర్తలు,స్థానిక మహిళలు పాల్గొన్నారు.

## మందాటి కొండమ్మకు నివాళు లర్పించిన గంగసాని, చప్పిడి



**పామూరు, పెన్ పవర్, జూలై14**

మండలం లోని ఇనిమెర్ల గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు మందాటి కొండయ్య సతీమణి మందాటి కొండమ్మ అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న వైయస్ఆర్సీపీ పామూరు మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి, జడ్పీటీసీ చప్పిడి సుబ్బయ్య సోమవారం ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. అనంతరం ఆమె కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేసారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించినట్లు తెలిపారు. వారితో పాటు అజీల్, వేటూరి మల్లికార్జున, సిద్దమూర్తి మల్లికార్జున, పిన్నిక మాల్యాద్రి, మందాటి హజరత్, బొట్లా హజరత్ నివాళులర్పించివరిలో ఉన్నారు.

# వేగినాటి కోటయ్య కాలనీలో దాహం కేకలు

## ఖాళీ బిందెలతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా





**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెనపవర్ జులై 14**

అసలే నిరుపేదలు కూలి పనులకు వెళితేనే పొట్టనిండని పరిస్థితి, త్రాగు నీటికోసం పనులు మానుకుని ట్యాంకర్ ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూడవలసిన వస్తుందని వేగినాటికోటయ్య కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 20రోజులనుండి కాలనీలో మంచినీటికి తీవ్ర ఇబ్బంది నెలకొనడంతో సోమవారం కాలనీవాసులు ఖాళీ బిందెలతో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా, నిరసన కార్యక్రమం చేపట్టారు. కాలనీలో తీవ్ర నీటి ఇబ్బంది ఉందని అధికారులకు తెలిపిన నిర్లక్ష్యంగా బదులిస్తున్నారని, కాలనీకి వచ్చే నీటి ట్యాంకర్ తనకు ఇష్టం వచ్చినప్పుడు ఏర్పాటు చేసి. ఇబ్బందులకు గురిచేస్తున్నారని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. గత ప్రభుత్వంలో నీటికి ఇబ్బంది ఉండేది కాదని, నీటి ఏద్ద డి వున్నప్పుడు అధిక ట్యాంకర్ల ద్వారా దాహర్తి తీర్చారని తెలిపారు. ప్రజల కనీస అవసరం అయినా త్రాగునీటి సమస్య పరిష్కరించడంలో నాయకులు. అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. వేగినాటికోటయ్య కాలనీ లో నీటిసమస్య త్వరితగతిన పరిష్కరించాలని డిప్యూటీ తహసీల్దార్ విజయభాస్కర్ కు వినతిపత్రం అందజేశారు.

## నరేంద్ర మోడీ నేతృత్వంలోనే భారతదేశ అభివృద్ధి అన్ని విధాల సాధ్యం

### సీనియర్ బిజెపి నాయకులు మాగులూరి రామయ్య స్పష్టం



**పొదిలి, పెన్ పవర్, జూలై 14**

ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోనే భారతదేశ అభివృద్ధి అన్ని విధాల సాధ్యపడుతుందని బిజెపి సీనియర్ నాయకులు మాగులూరి రామయ్య చెప్పారు సోమవారం నాడు నరేంద్ర మోడీ 11 సంవత్సర రాల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా పొదిలిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు ఈ సందర్భంగా మాగులూరి రామయ్య మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం పేద వర్గాల అభివృద్ధి కోసం వివిధ సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందన్నారు భారతదేశంలో పేదరిక నిర్మూలన ప్రధాన లక్ష్యంగా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పని చేస్తుందని ఆయన చెప్పారు ఈ సందర్భంగా స్థానిక 236 బూత్ పరిధిలోని ఇంటింటికి బిజెపి నాయకులు వెళ్లి కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ను వివరిస్తూ, వాటికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు సయ్యద్ ఖాదర్ భాష, పందిటి మురళి తో పాటు పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండవ రోజుకు చేరిన మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమ్మె




**గిద్దలూరు పెన్ పవర్ జులై 14**

మున్సిపల్ కార్యాలయం ముంది మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు నిరవధిక సమ్మెలో భాగంగా 2వ రోజు మోకాళ్ళపై నిల్చుని నిరసన తెలియజేసారు.ప్రభుత్వం తమ న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, జిఒ నంబర్ 36 ప్రకారం వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని, ఆప్కాస్ కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేసారు.ఈ సందర్భంగా సిఐటియు నాయకులు ఆవులయ్య మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలలో ఇంజనీరింగ్ కార్మికులు ఆదివారం తెల్లవారుజాము నుంచి సమ్మెలోకి వెల్లారని తెలిపారు. ప్రజారోగ్యం, ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపి, సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు పి మస్తాన్ రెడ్డి ఎం మౌలాలి నాగయ్య, పుల్లయ్య, రంగస్వామి, శ్రీరాములు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపులపై దాడులు నిర్వహించిన ఎక్సైజ్ అధికారులు

## వ్యక్తి పరార్ - 15 మద్యం బాటిళ్లు సీజ్

**బెస్తవారిపేట పెన్ పవర్ జూలై 14**

కంభం ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని బేస్తవారిపేట మండలంలోని పాత మల్లాపురం గ్రామంలో అక్రమ మద్యం వ్యాపారంపై ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల సందర్భంగా ఒక వ్యక్తి నల్ల పాలిథిన్ కవర్లో అనుమానాస్పదంగా తిరుగుతూ ఎక్సైజ్ సిబ్బందిని చూసి పారిపోయాడు.ఆ కవరును పరిశీలించగా అందులో 15 మద్యం క్వార్టర్ బాటిళ్లు ఉండగా వెంటనే వాటిని సీజ్ చేశారు. పారిపోయిన వ్యక్తిని కె దాయాదు గుర్తించారు. అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగుతోంది.సింగరపల్లి గ్రామానికి చెందిన నారు పేరయ్య మరియు అక్కపల్లి గ్రామానికి చెందిన సిహెచ్ గోవిందరెడ్డి అనే ఇద్దరు వ్యక్తులను బేస్తవారిపేట తహసీల్దార్ జితేంద్ర కుమార్ ముందు బైండ్ ఓవర్ చేశారు.ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ కొండా రెడ్డి మాట్లాడుతూ ఎవ్వరైనా నాటు సారాయి తయారీ, అక్రమ మద్యం నిల్వ, బెల్ట్ షాపుల నిర్వహణ, ఇతర రాష్ట్రాల



మద్యం రవాణా వంటి కార్యకలాపాలు నిర్వహించినా వాటిపై శాఖ కఠినంగా స్పందిస్తుందని హెచ్చరించారు. ప్రజలు ఇటువంటి సమాచారం ఇచ్చినట్లయితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# సింగల్ విండో చైర్మన్ గా చెరుకుపల్లి వెంకటరెడ్డి



**సియస్ పురం, పెన్ పవర్ జులై 14**

మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి చెరుకుపల్లి వెంకటరెడ్డి మండల సింగల్ విండో చైర్మన్ గా ఎన్నికైనట్లు కనిగిరిలోని ఎమ్మెల్యే కార్యాలయం నుండి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు సింగల్ విండో చైర్మన్ గా ఎన్నికైన వెంకటరెడ్డికి పలువురు పార్టీ నేతలు శ్రేయోభిలాషులు సహచరులు అభినందనలు తెలిపి వెంకటరెడ్డి మరెన్నో పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు.

# మాజీ సైనికునికి నివాళులు అర్పించిన ఎమ్మెల్యే సోదరుడు కృష్ణ కిషోర్



**గిద్దలూరు పెన్ పవర్ జులై 14**

గిద్దలూరు మున్సిపాలిటీలో పంచాయతీ పరిధిలోని కొత్తపల్లె అనారోగ్యంతో మాజీ సైనికుడు బోగాని సుబ్బారాయుడు మరణించగా, ఆయన భౌతికకాయానికి గిద్దలూరు ఎమ్మెల్యే సోదరుడు ముత్తుముల కృష్ణ కిషోర్ రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వారితో పాటు స్థానిక నాయకులు నివాళులు అర్పించారు.

# నేడు మండల సర్వ సభ్య సమావేశం

**కొనకనమిట్ల పెన్ పవర్ జులై 14**

మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వ సభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఓ ఈశ్వరమ్మ ఒక ప్రకటనలో తెలియచేశారు. ఈ సమావేశం ఉదయం 11 గంటలకు ఎంపీపీ మురళీ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలని అన్నారు. అలాగే సర్పంచులు,ఎంపీటీసీలు సకాలంలో తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

# వేధింపులు తాళలేక వివాహిత ఆత్మహత్య ప్రయత్నం

**గిద్దలూరు పెన్ పవర్ జులై 14**

గిద్దలూరు పట్టణంలోని గణేష్ నగర్ లో నివాసముంటున్న యగటిల లక్ష్మీ ప్రశాంతి నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేసింది. తన అత్తతో పాటు ఆడబిడ్డ, ఆడబిడ్డ భర్త వేధింపులకు గురి చేస్తున్నారని లక్ష్మీ ప్రశాంతి ఆత్మహత్యకు యత్నించినట్లుగా ఆమె భర్త రంగనాయకులు తెలిపారు. ప్రస్తుతం లక్ష్మీ ప్రశాంతిని గిద్దలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆస్తి పంపకాల వివాదంలో తమను చనిపోవాలని పలుమార్లు ఆడబిడ్డ, ఆడబిడ్డ భర్త, అత్త దూషించినట్లుగా బాధితురాలు లక్ష్మీ ప్రశాంతి వెల్లడించింది. భర్త రంగనాయకులు ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



# కంపెనీల మోసం.. ఆదుకున్న సీఎం చంద్రబాబు

- రైతుల పరిస్థితి విని బాధపడ్డ సీఎం
- రైతులపై ఆప్యాయతతోనే సీఎం అంగీకారం
- ప్రత్యామ్నాయ పంటల వైపు అన్నదాతల కదలాలి
- ఒప్పంద పత్రాలు ఇస్తేనే పొగాకు వేయండి
- రైతులంతా సంఘటితంగా ఉండాలి
- చరిత్రలో మొదటిసారిగా ప్రభుత్వం బర్లీ కొనుగోలు
- రైతు చివరఆకు కొనుగోలు చేసేలా చర్యలు
- రైతులెవరు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు
- మరిన్ని గోడౌన్లు అందుబాటులోకి తీసుకొస్తాం
- మార్టూరు, అడుసుమల్లి పొగాకు కేంద్రాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే ఏలూరి









**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 14**

బర్లీ పొగాకు రైతులను కంపెనీలు నమ్మించి మోసం చేశాయని... రైతుల పరిస్థితి తెలుసుకున్న సీఎం చంద్రబాబుకు బాధపడ్డారని , రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చి దేశ చరిత్రలో ఎన్నడూ ఎక్కడ లేని విధంగా మొట్టమొదటిసారి ప్రభుత్వమే బర్లీ కొనుగోలు చేపట్టిందని ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. సోమవారం మార్టూరు మార్కెట్ యార్డులో మార్టూరు మండల పొగాకు కొనుగోలు కేంద్రాన్ని, పర్చూరు మండలం అడుసుమల్లి లో యద్దనపూడి మండలం పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ఏలూరి ప్రారంభించారు. కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవానికి ఆయా మండలాల్లోని రైతులు పెద్ద ఎత్తున హాజరై ఎమ్మెల్యే ఏలూరికి తన స్వాగతం పలికారు. జై ఏలూరి జై జై ఏలూరి అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ అభిమాన నేతకు పుష్పగుచ్చాలు అందించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. రైతులకు భరోసాగా నిలుస్తున్న ఎమ్మెల్యే ఏలూరికి చప్పట్లతో అర్ధధ్వనాలు పలికారు. ఈ సందర్భంగా మార్టూరు ఏఎంసి, అడుసుమల్లి పొగాకు కొనుగోలు కేంద్రాల వద్ద జరిగిన సభలలో ఎమ్మెల్యే ఏలూరి ప్రసంగించారు.రైతులపై ఆప్యాయతతోనే సీఎం చంద్రబాబు చరిత్ర లో మొట్ట మొదటిసారిగా ప్రభుత్వమే పొగాకు కొనుగోలు చేసేలా అంగీకారం తెలిపారన్నారు. పొగాకు కంపెనీలు రైతులకు ఆశ చూపి నిలువునా మోసం చేసిన ప్రభుత్వం మాత్రం రైతు ప్రయోజనాలే రైతు సంక్షేమం కోసం రూ 273 కోట్లను విడుదల చేసి మార్క్ఫెడ్ ద్వారా చరిత్రలో ఎన్నడే లేని విధంగా కొనుగోలుకు శ్రీకారం చుట్టిందన్నారు. రైతులు పొగాకు కంపెనీల వలలో వద్దారని, మార్కెట్లో డిమాండ్ కంటే అత్యధికంగా సాగు చేసేలా రైతులకు ఆశ చూపి నిబంధనల పేరుతో తమ అవసరాలకు మాత్రమే కొనుగోలు చేసేలా ధరలు తగ్గించి రైతులను ఇబ్బందుల్లోకి నెట్టాయన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సంతోషంగా ఉంచాలన్నదే ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు సంకల్పం అన్నారు. కంపెనీలు అంగీకార పత్రాలు ఇస్తేనే రైతులు సాగు చేయాలని ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. ఈ ఏడాది పొగాకు మార్కెట్ డిమాండ్ కంటే అత్యధికంగా ఉందని, మళ్లీ సాగు చేస్తే తీవ్ర ఇబ్బందులు తలెత్తుతాయని, రైతుల ప్రత్యామ్నాయ పంటలు దిశగా కదలాలని ఎమ్మెల్యే ఏలూరి పిలుపునిచ్చారు. మార్కెట్లో మొక్కజొన్నకు ప్రభుత్వం కనీస మద్దతు ధర 2400 ప్రకటించిందని రానున్న రోజుల్లో ఇంకా ధర పెరిగే అవకాశం ఉందన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. పొగాకు రైతుకు అండగా ఉండటమే తమ ప్రథమ కర్తవ్యం అని, చివరి రైతు ఆకు కొనుగోలు చేసే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందకుండా సంయమనం పాటించాలన్నారు. రైతులకు రానున్న రోజుల్లో మరిన్ని కేంద్రాలు అందుబాటులోకి వస్తాయని ఎవరు అధైర్య పడవద్దు అన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం 20% లోపు నిమ్ము ఉండేలా చూసుకోవాలని రైతులకు ఎమ్మెల్యే ఏలూరి సూచించారు. మార్క్ఫెడ్ డిఎం కరుణ శ్రీ మాట్లాడుతూ రైతులు సహకరించాలని నిబంధనలు మేరకు పొగాకును కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతుల శ్రేయస్సు సంక్షేమమే లక్ష్యంగా ఎమ్మెల్యే ఏలూరి విశేష కృషి చేశారని కొనియాడారు.ఎమ్మెల్యే ఏలూరి సహకారం మరువలేనిది అన్నారు. మార్కెట్ కమిటీ చైర్మన్ గుంజి వెంకటరావు మాట్లాడుతూ రైతు సంక్షేమాన్ని కాంక్షించే ఎమ్మెల్యే ఏలూరి మనకు ఉండడం మన అదృష్టం అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం పొగాకు కొనుగోలు చేయడం కోసం తీసుకున్న నిర్ణయం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. దీనికి ప్రధాన కారణం రైతులపై ఎమ్మెల్యే ఏలూరికి నా ప్రేమ అభిమానమే అన్నారు. అన్నదాత సంక్షేమాన్ని కాంక్షించే ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఏలూరి ఉన్నంతవరకు రైతులకు ఎలాంటి లోటు ఉన్నదన్నారు. ప్రజలందరూ ఆశీస్సులతో విజేతగా నిలిచిన ఎమ్మెల్యే ఏలూరి ప్రజలకు ఏ కష్టం రానివ్వకుండా కంటికి రెప్పల కాపాడుతున్నారని పేర్కొన్నారు. బర్లీ కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేసేందుకు మరిన్ని గోడౌన్, కేంద్రాలను అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ గ్లోరియా, తాసిల్దార్లు ప్రశాంతి, బ్రహ్మయ్య ,మండల పార్టీ అధ్యక్షులు నల్లపునేని రంగయ్య చౌదరి,తాటి నాగేశ్వరరావు, శంషుద్దీన్, తొండపు ఆదినారాయణ, కామేపల్లి హరిబాబు, జనార్ధన్, రజాక్, శ్రీనివాసరావు,రావిపాటి సీతయ్య, కనపర్తి నాగేశ్వరరావు, తారక రామారావు, కె.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

# ఏపిపిఎస్‌సి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

**- జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు**





**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 14**

ఈ నెల 15వ తేదీ నుండి 23 తేదీ వరకు జరగనున్న ఏపిపిఎస్‌సి పరీక్షలకు ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా పకడ్బంధీగా ఏర్పాట్లు చేపట్టాలని జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు, అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లోని తమ ఛాంబర్‌లో జిల్లా రెవెన్యూ అధికారి చిన ఓబులేసు,సంబంధిత అధికారులతో సమావేశమై ఈ నెల 15వ తేదీ నుండి 23 తేదీల్లో జరగనున్న ఏపిపిఎస్‌సి పరీక్షల ముందస్తు ఏర్పాట్లుపై సమీక్షించి దిశానిర్దేశం చేసారు. లెక్చరర్స్ , జూనియర్ లెక్చరర్స్ ఉద్యోగాల భర్తీకి ఎపిపిఎస్‌సి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష నిర్వహించనుందని తెలిపారు. ఉదయం 9.30 నుంచి 12 గంటలు వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి 5 గంటలు వరకు పరీక్ష జరుగుతుందని చెప్పారు. జిల్లాలోని మొత్తం 6 సెంటర్స్ లో పెద్దారవీడు మండలలోని దేవరాజుగట్టు వద్ద గల కృష్ణ చైతన్య ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ నందు, మార్కాపురం లోని డాక్టర్ సామ్యూల్ జార్జ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ నందు, ఒంగోలు నగరంలోని బ్రిలియంట్ కంప్యూటర్ ఎడ్యుకేషన్ నందు, వల్లూరు లోని రైజ్ కృష్ణ సాయి ప్రకాశం గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ నందు, రైజ్ క్రిష్ణ సాయి గాంధీ గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్ నందు, ఒంగోలు నేషనల్ కౌన్సిల్ ఫర్ చర్చ్ సోషల్ యాక్షన్ ఇండియా నందు పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న అభ్యర్థులను ఉదయం 8 నుంచి 9 గంటలు వరకు, మధ్యాహ్నం 1 గంట నుంచి 2 గంటలు వరకు మాత్రమే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించడం జరుగుతుందని తెలిపారు. వారు హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును కూడా తప్పనిసరిగా తీసుకురావాలి చెప్పారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ వాచీలు, పరికరాలను ఎట్టి పరిస్థితిలోనూ అనుమతించడం జరగదని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాలవద్ద తగిన పోలీసు బందోబస్తు, వైద్య శిబిరాలు, త్రాగునీటి సదుపాయాన్ని ఏర్పాటు చేయాలని చెప్పారు. శానిటేషన్ ఏర్పాట్లు పటిష్టంగా చేపట్టాలని మునిసిపల్ మరియు పంచాయతీ రాజ్ శాఖ అధికారులను ఆదేశించారు. నిరంతరాయ విద్యుత్ సరఫరా ఉండాలని ఆదేశించారు. పరీక్షల నిర్వహణలో ఛీఫ్ సూపరింటిండెంట్లదే కీలక బాధ్యత అని డిఆర్ఓ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎపిపిఎస్‌సి సెక్షన్ ఆఫీసర్ విజయకుమార్, డిపిఓ వెంకట నాయుడు, పోలీసు, రెవెన్యూ, వైద్యారోగ్యశాఖ ప్రతినిధులు, ఛీఫ్ సూపరింటిండెంట్లు, లైజనింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఖతార్‌లో ఉద్యోగ అవకాశాలు

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జూలై 14**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఖతార్ దేశంలోని వెల్డర్స్ ఉద్యోగ అవకాశాల కొరకు అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ జె.. రవి తేజ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వెల్డర్స్ ఉద్యోగానికి అప్లై చేసే అభ్యర్థులకు వయస్సు 24 నుంచి 45 సంవత్సరాల లోపు ఉండాలి. విద్యార్హతలు : ఐటీఐ లేదా ఐటీసీ విద్యార్హత ఉండి నాలుగు సంవత్సరాల అనుభవం ఉండాలన్నారు. టీఐజీ లేదా ఏఆర్సీ మల్టీవెల్డర్ ఉద్యోగానికి ఎంపికైనవారికి రూ.52 వేల నుంచి రూ 61,500, టీఐజీ లేదా ఏఆర్సీ వెల్డర్ ఉద్యోగానికి రూ.42,500 నుంచి రూ.52వేల వరకు వేతనాలు ఇస్తారన్నారు. కాంట్రాక్ట్ కాలం రెండేళ్లు ఉంటుందన్నారు. ఉచిత వసతి, భోజనం, వైద్య సదు పాయాలు, రవాణా సౌకర్యం, స్వదేశానికి ఒక్కసారి వచ్చి పోవ టానికి టిక్కెట్ సౌకర్యం ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు పాస్పోర్టులు, అనుభవం సంబంధిత విద్యా ధృవపత్రాలతో జూలై 25 వ తేదీలోగా రిజిస్ట్రేషన్ కొరకు ఈ క్రింద వెబ్సైట్ లో నమోదు చేసుకోవలసినదిగా తెలిపారు. ఇతర వివరాలకు 8125215216, 9988853335, 8712655686, 8790118349, 8790117279 ను సంప్రదించాలని తెలిపారు.

# కూటమి ప్రభుత్వం పై వైకాపా తప్పుడు ప్రచారాలు

**- ఒంగోలు డిప్యూటీ మేయర్ బుజ్జి**



**కార్పొరేషన్ ఒంగోల్ పెన్ పవర్ జూలై 14**

ఒంగోలు పాత మార్కెట్ వద్ద అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయని వైసీపీ కార్పొరేటర్లు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ మేయర్ వేమూరి సూర్యనారాయణ (బుజ్జి) తీవ్రంగా ఖండించారు. ఒంగోలు నగర పాలక సంస్థ కార్యాలయంలోని మేయర్ ఛాంబర్ నందు నిర్వహించిన విలేఖరుల సమావేశంలో వేమూరి బుజ్జి మాట్లాడుతూ నిబంధనలకు లోబడి తాత్కాలిక కట్టడాలు నిర్మించినందుకు గతంలోని అనుమతులను రద్దు చేయడం జరిగిందని గుర్తు చేశారు. నిజాలు తెలుసుకోకుండా వైసిపి కార్పొరేటర్లు అసత్య ప్రచారాలు చేయడం సిగ్గుచేటని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో కూటమి ప్రభుత్వం కృతనిశ్చయంతో పని చేస్తుందని తెలిపారు. ఒంగోలు నగరాన్ని ఇతర నగరాలకు ధీటుగా అభివృద్ధి చేసేందుకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ కృషి చేస్తున్నారని దీనికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. మరొకసారి ఇలాంటి అసత్య ప్రచారాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు దాచర్ల రమణయ్య, అంబూరి శ్రీనివాస రావు, చింతపల్లి గోపి, తిప్పరపల్లి శ్రీను, ఆదిపూడి శాండిల్య, పసుపులేటి శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

# వేతనాలు పెంచండి లేకుంటే సమ్మెను ఉధృతం చేస్తాం




**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 14**

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ సిఐటియు ఆధ్వర్యంలో మార్కాపురం పురపాలక సంఘం నందు ఇంజనీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలంటూ రెండవ రోజు సమ్మె లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ కార్యాలయం వద్ద టెంటు వేసి ధర్నా నిర్వహించారు. రెండో రోజు ధర్నాను సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు ఏడు సంవత్సరాలుగా జీతాలు పెంచలేదని కార్మికులు చాలీచాలని వేతనాలతో పూట గడవడం కూడా కష్టంగా మారిందన్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించి సమ్మెను విరంపర చేయాలని ఆయన అన్నారు. జీవో నెంబర్ 36 ని అమలు చేయాలని ఇంజనీరింగ్ కార్మికులందరికీ 21 వేల రూపాయలు అమలు చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని ఇంజనీరింగ్ కార్మికులకు స్కిల్డ్, అన్ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులందరినీ, పర్మనెంట్ చేయాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, మరణించిన కార్మికుని కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని అన్నారు . డిమాండ్స్ పరిష్కరించాలని లేకుంటే సమ్మె ఉధృతం అవుతుందని సమ్మెకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు కే సుబ్బరాయుడు,గొట్టం హరి, కృష్ణ , చెన్నయ్య,ఆర్ శేఖర్, రెడ్డి ఎస్కే రషీద్ భాష పి సలాం ఖాన్ ఏ వి రమణ, శివ, అల్లూరయ్య, ఎస్ కే యూసఫ్, గురునాథం, షబ్బీర్, ధనంకుల చిన్నరాయుడు కే అనంతరం సింగ్ గంజరపల్లి అల్లూరయ్య గురునాథం కార్మికులు పాల్గొన్నారు.

# బాబు మోసపు వాగ్దానాలను ప్రజలు ఎండగట్టాలి

## ఎప్పుడు ఎన్నికలొచ్చినా ముఖ్యమంత్రి జగనే
## మాట తప్పడం.. మడమ తిప్పడం బాబు తర్వాతే
## కార్యకర్తలే పార్టీకి మూల స్తంభాలు





**పీసీపల్లి పెన్ పవర్ జూలై 14**

బాబు మోసపు వాగ్దానాలను ప్రజలు ఎండగట్టాలని కనిగిరి నియోజకవర్గం వైకాపా ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. మంగళవారం స్థానిక పెద్ద చెర్లోపల్లి లో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు చంద్రబాబు నోట ఒకటే మాట 'బాబు ష్యూరిటీ.. భవిష్యత్కు గ్యారంటీ' అనే మాట వినిపించేదని ఇప్పుడు ఎక్కడకు వెళ్లినా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' అనే మాట వినిపిస్తోందని అన్నారు. బటన్ నొక్కడం ఏమైనా పెద్ద పనా? మూలనున్న ముసలావిడ కూడా బటన్ నొక్కుతుందంటూ చంద్రబాబు విమర్శలు చేసి ఇప్పుడు బటన్ నొక్కడానికి డబ్బులు లేవంటూ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. అనంతరం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు బద్దెల లక్ష్మణ్ రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్, సూపర్ సెవన్ అంటూ మేనిఫెస్టోలో 143 హామీలిచ్చారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయన పార్టీ నేతలు, కార్యకర్తలు ఎన్నికల ముందు ఇంటింటికీ తిరిగి టీడీపీ హామీలకు గ్యారెంటీ అంటూ బాండ్లు పంచారని ఎద్దేవాచేశారు. ఇప్పుడు బటన్ నొక్కడానికి డబ్బులు లేవంట చూస్తుంటే బయమేస్తుంట. ఎన్నికల ముందు ఇచ్చిన మాట తప్పితే చొక్కా పట్టుకోని మరి అడుగమన్నారు. మరి ఎవరి చొక్కా పట్టుకోవాలో చెప్పాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి అయ్యింది . ఎన్నికల ముందు ఇంటింటికీ తిరిగి హామీలిచ్చారు. ఆడబిడ్డ నిధి కింద నీకు రూ.18 వేలు. రూ.18 వేలు.. అని నమ్మబలికారన్నారు. పిల్లలు అమ్మమ్మలు, అత్తమ్మలు కనిపిస్తే మీకు 50 ఏళ్లు నిండాయి కదా పెన్షన్ కింద నీకు రూ.48 వేలు నీకు రూ.48 వేలు.. అని చెప్పారు. ఇప్పుడు ఎవరి చొక్కా పట్టుకోని అడగాలో మీరే చెప్పండి? తమ ప్రభుత్వం వచ్చిన వెంటనే ఉద్యోగులకు ఐఆర్ అన్నారు. ఒక్క రూపాయి ఇచ్చిన పాపాన పోలేదని అన్నారు. మెరుగైన పీఆర్సీ అన్నారు. మూడు డీఏలు, ట్రావెల్ ఎలవెన్స్, సరెండర్ లీవ్స్, మెడికల్ రీయింబర్స్మెంట్ అన్నీ పెండింగ్.. పెండింగ్! జీఎస్ఐ, జీపీఎఫ్లను చంద్రబాబు వాడేసుకుంటున్నారు. ఆర్థిక విధ్వంసం అంటే ఇది కాదా అన్నారు. ఎన్నికల ముందు వలంటీర్లకు నెలకు రూ.10 వేలు వేతనం ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చాక 2.60 లక్షల వలంటీర్ ఉద్యోగాలను తీసేశారు. బెవరేజ్ కార్పొరేషన్లో 18 వేల మందిని తొలగించారని తెలిపారు. ఎవరైనా ఎన్నికల హామీలు ఏమయ్యాయని చంద్రబాబును ప్రశ్నిస్తే.. వెటకారంగా మాట్లాడటాన్ని ఇప్పుడు మనం చూస్తున్నాం. మొన్న రాయచోటిలో ఇలాగే ప్రశ్నిస్తే.. సంపాదించే మార్గం ఏదైనా ఉంటే నా చెవిలో చెప్పు అని వ్యాఖ్యానించటాన్ని చూశాం. అన్నీ తెలిసి కూడా ఆయన అడ్డగోలు హామీలిచ్చారు. చీటింగ్లో పీహెచ్డీ తీసుకున్న వ్యక్తి ఒక్క ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రమే అన్నారు. ఇక ఆయన నటన ఏ స్థాయిలో ఉంటుందంటే.. హామీలను ఎగ్గొట్టేసి చాలా బాధగా, ఆవేదనగా ఉంది. రాష్ట్రం చాలా క్లిష్ట పరిస్థితుల్లో ఉంని తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ లక్ష్మీకాంతం, ఓకే రెడ్డి, బుర్రా రెడ్డి, వైసీపీ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## పొదిలిలో ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన ప్రత్యేక స్క్వాడ్ అధికారులు





**పొదిలి, పెన్ పవర్, జులై 14**

పొదిలిలో ఫెర్టిలైజర్స్ షాపులను సోమవారం నాడు స్పెషల్ స్క్వాడ్ అధికారులు ఆకస్మిక తనిఖీ జరిపారు ఈ సందర్భంగా పట్టణంలోని పలు ఎరువులు విత్తనాలు పురుగుమందుల షాపులను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు అలాగే ఆయా షాపుల్లోనే తాకులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు ప్రభుత్వ నియమ నిబంధనలకు వ్యతిరేకంగా వ్యాపారాలు నిర్వహిస్తే, కఠిన చర్యలు తీసుకుంటామని మని స్క్వాడ్ అధికారులు హెచ్చరించారు అలాగే రైతులు కొనుగోలు చేసే పురుగుమందులు, విత్తనాలు, ఎరువులకు సంబంధించిన రసీదులను తప్పనిసరిగా వారికి ఇవ్వాల్సి ఉందని స్క్వాడ్ అధికారులు డీలర్లకు సూచించారు ఫెర్టిలైజర్స్ షాపులను తనిఖీ చేసిన స్క్వాడ్ అధికారుల్లో మంగళగిరి సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసులు, విజిలెన్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ షేక్ జిలాని, మండల వ్యవసాయాధికారి దేవి రెడ్డి శ్రీనివాసులు రెడ్డి తదితరులు ఉన్నారు.

## హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం





**పొన్నలూరు పెన్ పవర్ జులై 14**

మండలంలోని ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్సై కె అనూక్ తెలిపారు. ఈ సందర్భంగా ఎస్సై కె అనూక్ సోమవారం సాయంత్రం స్థానిక విగ్రహాల కూడలిలో ద్విచక్ర వాహన దారులకు హెల్మెట్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వలన తలకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని, ప్రాణాపాయం జరగదని అన్నారు. కావున ప్రతి ఒక్కరు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ద్విచక్ర వాహనాలకు సంబందించిన పత్రాలను పరిశీలించారు. వాహనదారులు వాహనాలకు సంబందించిన పత్రాలను కూడా వాహనంలో ఉంచుకోవాలని, డ్రైవింగ్ లైసెన్స్ కూడా తప్పనిసరిగా ఉండాలని, ఆలా లేకపోతె వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వాహనాలను సీజ్ చేయవలసి వస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది వాహనదారులు పాల్గొన్నారు.

# అర్జీలను సత్వరం పరిష్కరించాలి

## - జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ జూలై 14**

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)లో అందిన అర్జీలను సత్వరం పరిష్కారించేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, అధికారులను ఆదేశించారు. సోమవారం ఒంగోలు కలెక్టరేట్ లోని మీ కోసం సమావేశ మందిరంలో నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాల క్రిష్ణ, జిల్లా రెవెన్యు అధికారి చిన ఓబులేసు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు వరకుమార్, శ్రీధర్ రెడ్డి, జాన్సన్, పార్ధసారధి లతో కలసి పాల్గొని ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ గోపాల క్రిష్ణ, మాట్లాడుతూ అర్జీల పరిష్కారంలో ఎటువంటిజాప్యానికి తావులేకుండా నాణ్యతతో పరిష్కరించాలన్నారు. అర్జీదారుని సంతృప్తే ధ్యేయంగా అర్జీల పరిష్కారతీరు వుండాలని స్పష్టం చేశారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన అర్జీలను క్షుణంగా పరిశీలించి తమ సిబ్బందితో నిర్ణీత గడువులోగా త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీలు రీ-ఓపెన్ కాకుండా పరిష్కార చర్యలు ఉండాలన్నారు. ఫిర్యాదుదారులతో ముఖాముఖీగా మాట్లాడి ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకుని పూర్తిస్థాయిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# డెంగ్యూపై అవగాహన



**పీసీపల్లి పెన్ పవర్ జూన్ 14**

జాతీయ డెంగ్యూమాస ఉత్సవం డెంగ్యూ పై అవగాహన కార్యక్రమం మండలంలోని గుంటుపల్లి మరియు పెద్ద ఇర్లపాడు ఉన్నత పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు డెంగు కార్యక్రమం పై అవగాహన ఈ కార్యక్రమాన్ని ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మంజుల మరియు మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించారు . ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇది ఆడ ఎడిస్ టైగర్ దోమ ద్వారా వస్తుందని తెలిపారు. ఇంటి లోపల మరియు పరిసరాలలో నీటి నిల్వలు ఉన్నచోట దోమలు అధికంగా పెరుగుతాయని కావున ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి సూచించారు. డెంగు లక్షణాలలో తీవ్రమైన జ్వరం తలనొప్పి, కండరాలు నొప్పులు, చర్మంపై ఎర్రటి దద్దుర్ల, వాంతులు లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు . రక్త పరీక్షలు ద్వారా వ్యాధి నిర్ధారణ చేయవచ్చని దీనికి ప్రత్యేక చికిత్స లేకపోయినా వైద్యుల సూచన మేరకు తగిన చికిత్స తీసుకోవడం అవసరం అని అన్నారు. నివారణ చర్యలు తోటి డెంగ్యూ వ్యాధిని నియంత్రించవచ్చు అని చెప్పారు. ప్రతి ఒక్కరూ డెంగ్యూ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని కోరారు . ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు . ఈ కార్యక్రమంలో గుంటుపల్లి ప్రధానోపాధ్యాయులు బి లక్ష్మీనారాయణ మరియు పెద్ద ఇర్ల పాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్.కె అబ్దుల్ సుభాన్ మరియు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది , హెల్త్ సూపర్వైజర్ జక్రయ్య , విజయ్ ,మనీ, సువర్ణ ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకులో డిపాజిట్లపై అధిక వడ్డీ




**వలేటివారిపాలెం పెన్ పవర్ జూలై 14**

అన్ని బ్యాంకుల కంటే కూడా ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లో డిపాజిట్లపై అధిక వడ్డీ ఇస్తున్నట్లు వలేటివారిపాలెం బ్యాంకు మేనేజర్ సురేష్ తెలిపారు. సోమవారం ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ ఆధ్వర్యంలో అయ్యవారిపల్లి గ్రామంలో జన సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మేనేజర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ పీఎంజెజెబివై , , పిఎంఎస్ బివై , ఏపివై, పిఎం జేడివై పథకముల ద్వారా తక్కువ ఖర్చుతో రెండు లక్షల నుంచి నాలుగు లక్షల రూపాయలు పొందవచ్చునని తెలిపారు . ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు లో ఖాతాదారులకు బంగారు ఆభరణాలపై రుణాలు 1 గ్రాముకు రూ.6,800 ఇస్తామని ప్రజలకు తెలిపారు. అన్ని బ్యాంక్ ల కంటే డిపాజిట్ లపై అధిక వడ్డీ ఇస్తున్నట్లు తెలిపారు. బ్యాంక్ డిపాజిట్ల పథకముల గురించి ఆఫీసర్ రవికుమార్ క్లుప్తంగా వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు , ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

## హెచ్ఎం తీరుపై సబ్ కలెక్టర్ ఆగ్రహం

### విద్యా కమిటీ చైర్మన్ పటాన్ నాగుర్ ఖాన్ పిర్యాదు
### సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాధ్, తహసిల్దార్ చిరంజీవి పాఠశాలను తనిఖీ
### హెచ్ఎం ను విచారించిన సబ్ కలెక్టర్



**మార్కాపురం టౌన్ పెన్ పవర్ జూలై 14**

మార్కాపురం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుపై విద్య కమిటీ చైర్మన్ చేసిన అవినీతి ఆరోపణలపై సబ్ కలెక్టర్ త్రివినాద్ ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు పై వెంటనే స్పందించిన అధికారులు విచారణలో భాగంగా సబ్ కలెక్టర్, తహసిల్దార్, విద్యాశాఖ అధికారులు పాఠశాలకు చేరుకొని హెచ్ఎం శ్రీదేవినీ విచారించారు. పాఠశాలలో జరుగుతున్న మధ్యాహ్నం భోజనం తీరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందుతుందా లేదా అని ఆరా తీశారు.

## వంగవీటితో ఆకుపాటి భేటీ



**పామూరు, పెన్ పవర్ జూలై 14**

విజయవాడ మాజీ శాసనసభ్యులు టిడిపి సీనియర్ నాయకులు వంగవీటి రాధాకృష్ణను విజయవాడలోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన వేణుగోపాల స్వామి వారి చిత్రపటాలను ఆయనకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.

## ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ మర్యాదపూర్వకంగా కలిసిన ఆకుపాటి



**పామూరు, పెన్ పవర్ జూలై14**

ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దేగల ప్రభాకర్ ను గుంటూరులోని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వ కలిసి ఘనంగా సన్మానించి శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ మదన వేణుగోపాల స్వామి వారి చిత్రపటాన్ని ఆయన అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పలువురు ఆకుపాటి మిత్రులు పాల్గొన్నారు.

## పామూరు సింగల్ విండో చైర్మన్గా ఉప్పలపాటి హరిబాబు

**పామూరు, పెన్ పవర్ జులై 14**

పట్టణానికి చెందిన సీనియర్ తెలుగుదేశం పార్టీ నాయకులు, పామూరు మండల తెలుగు యువత అధ్యక్షులు ఉప్పలపాటి హరిబాబు మండల సింగల్ విండో చైర్మన్ గా ఎన్నికైనట్టు కనిగిరిలోని ఎమ్మెల్యే కార్యాలయం నుండి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగల్ విండో చైర్మన్ గా ఎన్నికైన ఉప్పలపాటి హరిబాబు కు పలువురు పార్టీ నేతలు శ్రేయోభిలాషులు, సహచరులు, అభినందనలు తెలిపి హరిబాబు మరెన్నో పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఉప్పలపాటి హరిబాబు మాట్లాడుతూ నా కృష్ణని గుర్తించి, నాపై నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అప్పగించినందుకు కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, మండల పార్టీ నాయకులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు.



# కరేడు భూసేకరణపై అపోహలు వద్దు

## అసత్య ప్రచారాలను నమ్మవద్దు -మీ అందరికీ అండగా నేనుంటా -ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

## - కరేడు పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం








**ఉలవపాడు పెన్ పవర్, జూలై 14:**

ఇండోసోల్ కంపెనీకి సంబంధించి కరేడు ప్రాంత భూముల సేకరణలో ఏ ఒక్క రైతుకు కూడా అన్యాయం జరగకుండా చూసే బాధ్యత తనదని కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టమైన హామీ ఇచ్చారు.మండలంలోని కరేడు పంచాయతీలోని టెంకాయచెట్లపాలెం గ్రామంలో సోమవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రతి ఇంటికి తిరుగుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలో జరిగిన అభివృద్ధి మరియు సంక్షేమాన్ని ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. గ్రామస్తులు తమకు ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తారని ప్రజలకు ఎమ్మెల్యే తెలియజేశారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు భూ సేకరణ గురించి ప్రస్తావించగా ఏ ఒక్క రైతుకు అన్యాయం జరగదని, అవసరమైతే రాష్ట్ర ప్రభుత్వంతో అనేక సార్లు చర్చించి న్యాయం చేసేందుకు కృషి చేస్తానని భరోసా కల్పించారు.. భూ సేకరణలో భాగంగా పల్లెపాలెం టెంకాయచెట్లపాలెం, బట్టిసోమయ్యయపాలెం, కొత్తపల్లిపాలెం రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూస్తానని స్పష్టమైన హామీ ఇచ్చారు. అభివృద్ధిని ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిందేనని అదే సందర్భంలో ప్రభుత్వానికి మనమందరం సహకరించాలన్నారు. ఒక రైతు బిడ్డగా రైతుల కష్టాలు బాధలు తనకు తెలుసు అన్నారు. భూ సేకరణ విషయంలో ఎవరి మాటలు నమ్మవద్దని అసత్య ప్రచారాలపై అప్రమత్తంగా ఉండాలని రైతులకు సూచించారు. ఏది ఏమైనా రైతుల ప్రయోజనాలే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు.కూటమి ప్రభుత్వం ఏర్పడిన తొలి సంవత్సరంలోని పెన్షన్ల పెంపుదల, ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంత మందికి తల్లికి వందనం పథకం, నిరుద్యోగులు కొరకు డీఎస్సీ, రైతుల పెట్టుబడి సహాయం కింద త్వరలో అన్నదాత సుఖీభవ పథకం ద్వారా నిధులు, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తుందని ఎమ్మెల్యే తెలియజేశారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంతమాత్రంగా ఉన్నప్పటికీ ఇచ్చిన ప్రతి ఒక్క హామీని నెరవేర్చటానికి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు.రాష్ట్రాన్ని పారిశ్రామికంగా అభివృద్ధి చెందించేందుకు ప్రపంచం లోని మేటి కంపెనీలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి తీసుకురావడానికి యువ నాయకులు, మంత్రివర్యులు నారా లోకేష్ కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే తెలియజేశారు.కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమానికి గ్రామస్తులు తమ సంపూర్ణ మద్దతును తెలియజేశారు.. అలాగే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రం, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కందుకూరు నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోవటం ఖాయమని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు రాచగర్ల సుబ్బారావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు కోడూరు ఆదాము, వాయల అంకయ్య, పామంజి రామదాసు, వాయిల శ్రీను, ఆవుల యానాది, బాలమురళి, పామంజి పోలిశెట్టి, పోలుబోయిన శ్రీను, కన్నా ప్రసాద్, రాంబాబు, మెట్ట శ్రీనివాసుల రెడ్డి మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# రామచంద్రపురం గ్రామంలో దళితులకు ఇచ్చిన భూమిని రీ సర్వే చేసి వారికి హద్దులు చూపించాలి

### సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా




**కందుకూరు పెన్ పవర్, జూలై 14**

వలేటివారిపాలెం మండలం లో రామచంద్రపురం గ్రామంలో ఇందిరా గాంధీ ప్రభుత్వ హయాంలో కందుకూరు ప్రాంత దళితులకు ఇచ్చిన 470 ఎకరాల ప్రభుత్వ భూములకు రీ సర్వే జరిపి అర్హులైన, సాగుదారులైన వారందరికీ పొజిషన్ చూపించాలని, భూముల పై హక్కులు కల్పించాలని సోమవారం కందుకూరు సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా నాయకులు జీవీబీ కుమార్ మాట్లాడారు. ఇందిరాగాంధీ ప్రభుత్వం 270 ఎకరాలను 42 మంది దళితులకు అప్పటి ప్రభుత్వం అసైన్మెంట్ భూమిని ఇస్తూ ఉత్తర్వులు ఇచ్చిందని, కొద్దిమందికి పట్టాలు కూడా మంజూరు చేసిందని పేర్కొన్నారు. కానీ భూమి పొజిషన్ చూపించలేదు. దళితులు కాళ్లు అరిగేలా ప్రభుత్వ కార్యాలయాల వద్దకు తిరిగినా అదిగో ఇదిగో అంటూ వాయిదా వేస్తూ నేటికి పొజిషన్ చూపకుండా ఇబ్బందులు గురి చేసిందన్నారు. దీనిపైన న్యాయస్థానం ఆశ్రయిస్తే 9 మందికి మాత్రమే హద్దులు చూపించిందన్నారు. నేటికీ ఆన్లైన్ లో దళితుల పేర్లు ఉండగా, ఆ గ్రామంలోని అగ్రవర్ణం పెత్తందారులు ఆ భూమిని సాగు చేస్తూ, భూమిలోకి దళితులను రానివ్వకుండా అడ్డుపడుతున్నారని పేర్కొన్నారు. ఈ విషయంపై ఉన్నతాధికారులు జోక్యం చేసుకోవాలని, రీ సర్వే జరిపి, గతంలో ఎవరికైతే అసైన్మెంట్ పట్టాలు ఇచ్చారో, వారికి హద్దులు చూపించాలని, 42 మంది లబ్ధిదారులకు ఆ భూమిపై హక్కులు కల్పించేలా ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని కందుకూరు సబ్ కలెక్టర్ వారిని కుమార్ కోరారు. ఆ భూమిని ఎవరైతే ఆక్రమించి ఆక్రమంగా సాగు చేస్తున్నారో వారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ధర్నాకు మద్దతుగా సామాజిక కార్యకర్తలు పాలేటి కోటేశ్వరరావు, డి సి హెచ్ మాలకొండయ్య, బి వెంకటేశ్వర్లు, ఐఎఫ్టియు రాష్ట్ర నాయకులు ఆర్ మోహన్ మాట్లాడారు. అనంతరం కందుకూరు సబ్ కలెక్టర్ కి వినతి పత్రం ఇచ్చి సమస్యను వివరించారు. ఎవరి దగ్గర అయితే కచ్చితంగా పత్రాలు ఉన్నాయో వారికి భూమి దక్కేలా చేస్తానని, 42 మంది భూమి వివరాలు పరిశీలన చేస్తామని, పరిష్కారం అయ్యేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నాలో భూమి లబ్ధిదారులు దేవరకొండ. ఆదిలక్ష్మి, జే. సతీష్ కుమార్, మహేష్ బాబు, కిషోర్ బాబు, నక్క గంగాధర్, దారా వెంకటేశ్వర్లు, శ్యామల, శైలజ, మాల్యాద్రి, కె అగస్త్య, భాను ప్రసాద్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


# బాధితులకు సత్వరమే న్యాయం

## గ్రీవెన్స్ కు 94 అర్జీలు

## జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్

**క్రైమ్ రిపోర్టర్ ఒంగోలు పెన్ పవర్ జూలై 14**

ప్రజలకు సత్వరమే న్యాయం అందించే అందుకే ప్రభుత్వం ప్రతి సోమవారం గ్రీవెన్స్ నిర్వహిస్తుందని జిల్లా ఎస్పీ ఏ ఆర్ దామోదర్ అన్నారు. ప్రజల నుండి వచ్చే వివిధ రకాల సమస్యల యొక్క ఫిర్యాదులను పరిష్కారించుటయే లక్ష్యంగా ప్రకాశం జిల్లా పోలీసులు పనిచేస్తున్నారు. గ్రీవెన్స్ కు మొత్తం 94 అర్జీలు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాల నుండి వచ్చిన పిర్యాదుదారులతో పోలీస్ అధికారులు ముఖాముఖీగా మాట్లాడి వారి ఫిర్యాదుల గురించి వివరంగా అడిగి తెలుసుకుని ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, సత్వరం పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (అడ్మిన్) నాగేశ్వర రావు, మహిళ పోలీస్ స్టేషన్ డిఎస్పీ రమణ కుమార్, ఎస్సీ/ఎస్టీ సెల్ ఇన్స్పెక్టర్ దుర్గ ప్రసాద్, డిటిసి ఇన్స్పెక్టర్ షమీముల్లా, ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఎస్సై జనార్ధన్ రావు, మరియు సిబ్బంది పాల్గొన్నారు.




# ఇండో సోల్ కంపెనీకి ప్రభుత్వం ఇచ్చిన అనుమతులు రద్దు చేయాలని సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా




**కందుకూరు పెన్ పవర్,జూలై 14:**

ఇండోసోల్ మాకొద్దు- పంట పొలాలే మాకు ముద్దు అంటూ రైతు సంఘం,రైతు కూలీ, వ్యవసాయ కార్మిక, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కందుకూరు లోని సబ్ కలెక్టర్ ఆఫీస్ వద్ద ధర్నా నిర్వహించారు. ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నాకు సిపిఎం ఉలవపాడు ప్రాంతీయ కమిటీ కార్యదర్శి జీవీబీ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి ఏపీ రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టిపాటి. వెంకటేశ్వర్లు మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ పచ్చని పంట పొలాలు, సముద్ర తీరం, సంవత్సరంలో మూడు పంటలు పండే భూములను మేము సెంటు కూడా ఇవ్వము, అవసరమైతే మా ప్రాణాలైనా ఇస్తాం కానీ, భూములను వదిలే ప్రసక్తే లేదని గ్రామ సభలో తీర్మానం చేశారు, జాతీయ రహదారిని దిగ్బంధనం చేశారు, ఎంతటి పోరాటానికైనా వెనకాడ బొమని, ఇండోసోల్ కంపెనీ వారే కరేడు ను వదిలి వెనక్కి పోవాలని రైతులు, వ్యవసాయ కూలీలు, మత్స్యకారులు, గిరిజనులు అంటున్న రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం ఏంటి అని ప్రశ్నించారు. 85శాతం ప్రజలు భూములు ఇవ్వమని, ఇండోసోల్ ను వ్యతిరేకిస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలంతా వ్యతిరేకిస్తుంటే, ప్రభుత్వ రాజ్యాంగబద్ధంగా మెజారిటీని పరిగణలోకి తీసుకొని కరేడును వదిలి వెనక్కి పోవాలని డిమాండ్ చేశారు. సిపిఐ కందుకూరు నియోజకవర్గ కార్యదర్శి బూసి సురేష్ మాట్లాడుతూ కరేడు ప్రజలకు మద్దతుగా వామపక్షాలు గా సిపిఐ గా ముందుండి పోరాడుతామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కూడా ఈ పోరాటాన్ని ప్రజా వ్యతిరేకతను తెలిపామని పేర్కొన్నారు.సీఐటీయూ జిల్లా నాయకులు ఎస్ ఎ గౌస్ బాషా మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ కరేడులోని మొత్తం ప్రజలు వ్యతిరేకిస్తుంటే, ఏకపక్షంగా ప్రభుత్వం ఇండసోల్ పక్షం ఉండటం సిగ్గుచేటని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో ప్రజల అభిప్రాయాలకు ప్రాధాన్యత ఇవ్వకపోతే ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిఐటియు, ఐద్వా, ఐ ఎఫ్ టి యు, ఏఐటియుసి, వ్యవసాయ కార్మిక సంఘం, రైతు కూలి సంఘం నాయకులు పాల్గొని మాట్లాడారు. ఈ ధర్నా కార్యక్రమం అనంతరం సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీ పూజ కి వినతి పత్రం సమర్పించారు. సబ్ కలెక్టర్ మాట్లాడుతూ కరేడు గ్రామసభలో ప్రజల తెలిపిన అభిప్రాయాలని రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక పంపామని, ప్రభుత్వం చర్చించిన తర్వాత ఆ విషయాలను ప్రజలకు తెలుపుతామని, ప్రజా సంఘాల నాయకులకు మీటింగ్ వేసి తెలియజేస్తామని హామీ ఇచ్చారు. ఈ ధర్నా కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పి మాలకొండయ్య, ఎస్.కె హుస్సేన్, ఆనందమోహన్, మురళి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు దువ్వూరి జాన్, కత్తి సుజాత, పొట్లూరి రవి, సిఐటియు ఉలవపాడు మండల నాయకులు వీసం. విజయ్, ఐఎఫ్టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి ఆర్ మోహన్, రైతు కూలి సంఘం నెల్లూరు జిల్లా నాయకులు కే నాంచార్లు, చలంచర్ల వెంకటేశ్వర్లు, పిడిఎస్ యూ రాష్ట్ర నాయకులు ఎల్ రాజశేఖర్, సామాజికవేత్త పాలేటి కోటేశ్వరరావు, కరేడు గ్రామం నుండి గిరిజనులు, రైతు కూలీలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

# వైసీపీ కార్యకర్త కి 10,000 ఆర్థిక సహాయం అందించిన షేక్ రఫీ

**కందుకూరు పెన్ పవర్, జూలై 14**

పట్టణంలోని 27వ వార్డు కు చెందిన వైసీపీ కార్యకర్త కొచ్చర్ల మాల్యాద్రి ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలిసిన వెంటనే వైసిపి పట్టణ అధ్యక్షులు షేక్ రఫీ తక్షణమే స్పందించి మాల్యాద్రి ఇంటికి వెళ్లి తనని పరామర్శించి పదివేల రూపాయల ఆర్థికసహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు శివప్రసాద్, అయ్యన్న, ఆదిలక్ష్మి, షేక్ బికారి పాల్గొన్నారు.



# బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కూటమి లక్ష్యం

### టిడిపి నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు





**కందుకూరు పెన్ పవర్, జూలై 14**

బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కూటమి ప్రధాన లక్ష్యమని టిడిపి సీనియర్ నాయకుడు అల్లం వెంకటేశ్వర్లు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వర రావు ఆదేశాలు మేరకు ఓగూరు గ్రామంలో టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి సమస్యలు ఏమైనా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు ఉంటే స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని తెలిపారు. అల్లం వెంకటేశ్వర్లు,గ్రామ పార్టీ అధ్యక్షులు బోగినేని వెంకటేశ్వర్లు, గ్రామ నాయకులు అల్లం రాదయ్య, దివి సుబ్బారావు, కంద్రా హరి, చల్లా మహేంద్ర, బోగినేని మణి, చల్లా శివరాం, పేరం రమేష్ సూరం బ్రాహారెడ్డి,చల్లా నారాయణ, నూకతోటి మాలీరావు తదితరులు పాల్గొన్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# సేవే లక్ష్యంగా మ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు

-ప్రజా దర్బార్‌లో ప్రజల వినతులకు స్పందన

- వెంటనే పరిష్కారాలకు ఆదేశాలు





**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూలై 14**

బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ రాజు , ప్రజల అభ్యున్నతే ధ్యేయంగా కొనసాగిస్తూ నిరంతరం ప్రజాసేవలో భాగంగా తిరుగులేని సంకల్పంతో ముందుకు సాగుతున్నారు. ఈ నేపథ్యంలో ఆయన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ప్రజల నుండి నేరుగా వినతులు, పిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా వచ్చిన సమస్యలను తక్షణమే సంబంధిత అధికారులతో మాట్లాడి, త్వరితంగా పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. విద్యుత్, నీటి సరఫరా, పింఛన్లు, రేషన్ కార్డులు, రహదారి సమస్యలు తదితర అంశాలపై వచ్చిన పిర్యాదులకు ఎమ్మెల్యే చొరవగా స్పందించారు. ప్రజా దర్బార్‌లో భాగంగా వ్యక్తిగత, సామూహిక స్థాయిలో పలు సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన ప్రధాన కర్తవ్యమని చెప్పారు.

# జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించిన జిల్లా ఎస్పీ తుషార్ డూడి



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జూలై 14**

అర్జీదారులు సమస్యలను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఆస్తి తగాదాలు, స్థల వివాదాలు, ఆర్థిక లావాదేవీల మోసాలు తదితర సమస్యల పరిష్కారానికి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన 68 మంది ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను జిల్లా ఎస్పీ స్వీకరించారు. సమస్యలు చట్టపరంగా పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా చట్టపరిధిలో విచారించి పరిష్కరించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించబోమని హెచ్చరించారు. పరిష్కరానికి తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రదాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీసీఎస్ డీఎస్పీ జగదీష్ నాయక్, పిజిఆర్ఎస్ సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి గుదే రాజారావు

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 14:**

మున్సిపల్ ఇంజనీర్ కార్మికులు చేస్తున్న నిరవధిక సమ్మెలో బహుజన సమాజ్ పార్టీ నాయకులు పాల్గొని మద్దతు పలికారు. బహుజన సమాజ్ పార్టీ జిల్లా అడ్వైజర్ డాక్టర్ గడ్డం ఏలియా మాట్లాడుతూ జీవో నెం. 36 ప్రకారం జీతాలు చెల్లించాలి. కేటగిరి నిర్ణయంలో జరిగిన తప్పులు సరిదిద్దాలి గత 17 రోజుల సమ్మెకాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలి. డైలీవేజ్ కార్మికులను ఆప్కాస్ లో చేర్చాలి, షరతులు లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేయాలి, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న సమ్మెకు పూర్తిగా బహుజన సమాజ్ పార్టీ మద్దతు ఇస్తుందని తెలియజేశారు, బహుజన సమాజ్ పార్టీ నాయకులు ఏపూరి జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి -జిల్లా కలెక్టర్

## ఉయ్యూరు శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల క్రీడల సన్నద్ధ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్లు







**మచిలీపట్నం (పెన్ పవర్) జులై 14**

విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను ఎంచుకుని, వాటి సాధనకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ విద్యార్థులకు ఉద్బోధించారు. సోమవారం సాయంత్రం ఆయన ఉయ్యూరు మండలంలోని శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల ప్రాంగణంలో నిర్వహించిన క్రీడల సన్నద్ధ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విద్యాసంస్థలో క్రీడల నిర్వహణ సౌలభ్యం నిమిత్తం నీలం, ఎరుపు, ఆకుపచ్చ, పసుపు రంగు విభాగాల వారీగా విద్యార్థులను విభజించి వారి బృందానికి నాయకులుగా నియమితులైన వారికి నియామక పత్రాలను అందించి అభినందించారు. ఈ క్రమంలో జిల్లా కలెక్టర్ క్రీడా జ్యోతి వెలిగించి విద్యార్థుల చేతికి అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్క విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని దాని సాధనకు కృషి చేయాలన్నారు. జీవితంలో ఏమి కాదలుచుకున్నామో దాని పట్ల స్పష్టత కలిగి ఉండాలని, తల్లిదండ్రులు, గురువుల దిశా నిర్దేశాలను ఆలకించాలని సూచించారు. జీవితంలో కొన్నిసార్లు అనుకున్న దానికి విరుద్ధంగా జరిగే పరిస్థితులు ఉంటాయని, కానీ నిరాశ చెందకుండా వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. భవిష్యత్తులో ఉద్యోగ అన్వేషకులుగా కాకుండా, పదిమందికి ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి ఎదిగే లక్ష్యంగా ఉండాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని ఆకాంక్షించారు. జీవితంలో ఎంత ఎదిగినా, ఏమి సాధించినా విలువలు లేని ఎదుగుదల తాత్కాలికమేనని, విలువలు కలిగి జీవించడం ఎంతో సంతృప్తినిస్తుందన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, హ్యారీపోటర్ సిరీస్ రచయిత్రి జెకే రౌలింగ్, శ్వేత విప్లవ పితామహుడు అమూల్ కంపెనీ వ్యవస్థాపకుడు వర్గీస్ కురియన్, పౌర హక్కుల ఉద్యమకారుడు మార్టిన్ లూథర్ కింగ్ వంటి ప్రముఖులు తమ జీవితంలో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని ఎలా ఉన్నత స్థాయికి చేరుకున్నారో వారి జీవిత విశేషాలను సోదాహరణంగా వివరించి విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపారు. అనంతరం పాఠశాల పూర్వ విద్యార్థిని తన కుమార్తె అయిన ప్రభాత వీణ సహకారంతో అంధుడైన ప్రభాకర్ రచించిన అడ్వాన్సింగ్ ఇండియా వర్సెస్ ప్రభాకర్స్ విజన్ అనే పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ ఆవిష్కరించి వారిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీవిశ్వశాంతి విద్యాసంస్థల చైర్మన్ మాదల సుబ్రహ్మణ్యేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ సూర్యశేఖర్, మాదల సుష్మ, ప్రిన్సిపల్ పద్మజావాణి, వైస్ ప్రిన్సిపల్ రుద్ర కుమారి, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పోగొట్టుకున్న బ్యాగ్ మరియు ఫోన్ రికవరీ...

## గంటల వ్యవధిలో రికవరీ చేసి బాధితులకు అందజేసిన ఎస్ఐ. శివరామకృష్ణ.



**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 14**

మండల పరిధిలోని కొండవీడు చిల్డ్రన్ పార్క్ సందర్శనకు పర్చూరు (బాపట్ల జిల్లా) కు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు 13.07.2025 రాత్రి 7 గంటల సమయంలో,కొండవీడు చిల్డ్రన్ పార్క్ సందర్శనకు వెళ్లి, అక్కడ తన బ్యాగ్ మరియు సెల్ ఫోన్ పోయాయని రాత్రి 9 గంటలకు ఎడ్లపాడు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన వెంటనే ఎస్ఐ శివరామకృష్ణ మరియు సిబ్బంది హెడ్ క్వార్టర్స్‌ను సంప్రదించి, మొబైల్ లొకేషన్ సాయంతో ఒక గంట వ్యవధి లో బ్యాగ్ మరియు ఫోన్ ను కొండవీడు సమీపంలోనీ అరటి తోటలో గుర్తించి తిరిగి శ్రీనివాసరావు కి అప్పగించడం జరిగింది. ఈరోజు మరొక ఫిర్యాదు మధ్యాహ్నం 12 గంటలకు తిమ్మాపురం గ్రామానికి చెందిన హార్టికల్చర్ అసిస్టెంట్ శైఖ్ ఐషా తమ మొబైల్ పోయినట్లు సమాచారం ఇచ్చారు. వెంటనే స్పందించిన ఎస్ఐ హెడ్‌క్వార్టర్స్ సహాయంతో ఫోన్ లొకేషన్‌ను ట్రేస్ చేసి 12:30 గంటలకు మొబైల్‌ను గుర్తించి వారికి అప్పగించడం జరిగింది. ఈ రెండు ఘటనల్లో కూడా పోలీసుల వేగవంతమైన చర్యలతో ప్రజల ఆస్తి సురక్షితంగా తిరిగి అందించబడింది. ఈ సందర్భంగా బాధితులు పోలీసుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఎడ్లపాడు ఎస్సై శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు తమ విలువైన వస్తువులపై జాగ్రత్తగా ఉండాలని, ఎటువంటి నష్టం జరిగినా వెంటనే పోలీసులను సంప్రదించాలని కోరుతున్నాము అని తెలిపారు.

# ఢిల్లీలో మెరిసిన కుప్పడం సిల్క్

## అవార్డు అందుకున్న జిల్లా కలెక్టర్

- భారత్ మండపంలో జరిగిన అవార్డుల కార్యక్రమం

- జాతీయ స్థాయిలో మొదటి స్థానం దక్కించుకున్న చీరాల సిల్క్ చీరలు

- కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి అవార్డు అందుకున్న కలెక్టర్ వెంకట మురళి

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల జులై 14:**

బాపట్ల జిల్లా చీరాల సిల్క్ చీరలు తమదైన ప్రత్యేకతతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాయి. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో సోమవారం ఘనంగా నిర్వహించిన 'ఒక జిల్లా - ఒక ఉత్పత్తి అవార్డుల ప్రదానోత్సవంలో చీరాల కుప్పడం చీరలు ఎంపికై, జిల్లాకు అరుదైన గౌరవాన్ని తీసుకొచ్చాయి. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ నుంచి బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ఈ ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర జౌళి, వస్త్ర పరిశ్రమ శాఖ మంత్రి సవిత హాజరయ్యారు. చీరాలలో నేయబడే కుప్పడం సిల్క్ చీరలు వాటి ప్రత్యేకమైన నూలుపనితనం, ఆకట్టుకునే రంగుల శైలి, నూతన డిజైన్లతో విస్తృత ఆదరణ పొందుతున్నాయి. ఈ చీరలకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించడం పట్ల చీరాల ప్రాంతంలోని చేనేత కళాకారులు, నేత కార్మికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ, చీరాల చీరలకు లభించిన ఈ జాతీయ గుర్తింపు జిల్లాకు గర్వకారణమన్నారు. స్థానిక చేనేత పరిశ్రమ అభివృద్ధికి, కళాకారులకు ఇది మరింత ప్రోత్సాహాన్ని ఇస్తుందని తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగం, స్థానిక చేనేత కళాకారుల సమష్టి కృషితోనే చీరాల చీరలకు ఈ బ్రాండ్ విలువ




ఏర్పడిందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. %ంఈంఅ% పథకం ద్వారా స్థానిక సంపదకు జాతీయ ప్రమాణం లభించిందని, ఇది తమ ఉత్పత్తులకు మరింత మార్కెట్‌ను తెరిచే అవకాశం కల్పిస్తుందని హస్తకళాకారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. చీరాల చీరల వైభవం, నాణ్యతకు ఈ అవార్డు ఒక నిదర్శనమని, దీని ద్వారా చీరాల నేత కళ ప్రపంచానికి మరింత చేరువవుతుందని ఆశాభావం వ్యక్తమవుతోంది.

# కౌలు రైతు కార్డుల కోసం ధరఖాస్తు చేసుకోండి: పోట్ల నరసింహారావు

**పెన్ పవర్ కారంపూడి జూలైవ14**

కౌలుకు పోలాలను తీసుకొని పంట సాగు చేసే రైతులందరూ కౌలు కార్డుల కొరకు ధరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పోట్ల నరసింహారావు మండలంలోని కౌలురైతులందరినీ కోరారు. సోమవారం మండల తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ తో కలిసి గ్రామ రెవిన్యూ అధికారులు మరియు గ్రామ వ్యవసాయ ఉద్యాన విహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు . కారంపూడి మండలంలోని అన్ని గ్రామాలకు కలిపి 1711 కౌలు కార్డులు ఇవ్వ వలసి ఉండగా, ఇప్పటి వరకు 282 కౌలు కార్డులు మాత్రమే కౌలు దారులకు ఇవ్వటం జరిగిందని తెలిపారు. మిగిలిన కౌలు కార్డులన్నీ ఈ వారంలో పూర్తి చేస్తామని తెలిపారు. కౌలు కార్డు కావలసిన రైతులు భూమి యజమాని ఆధార్ కార్డు, పోలం పాసు పుస్తకం, కౌలుదారుని ఆధార్ కార్డు నకల్లు, కౌలుదారుని ఫోటో తో పాటుగా భూయజమాని అంగీకార పత్రము ఫారం-1 లను గ్రామ రెవిన్యూ అధికారికి గానీ లేదా గ్రామ వ్యవసాయ ఉద్యాన సహాయకులకు గానీ అందజేయాలని తెలిపారు. కౌలుకార్డులు ఉండటం వలన ప్రభుత్వ సంక్షేమ పథకాలైన అన్నదాత



సుఖీభవ, వడ్డీ లేని పంట రుణాలు, పంటల భీమా, పంట నష్టపరిహారం, పంట రుణాలు, పంటలను మద్దతు ధరలకు ప్రభుత్వం సేకరించినప్పుడు అమ్ముకోవటానికి మొదలగు పలు ఉపయోగాలు కలవు కావున మండలం లోని అందరు కౌలు రైతులు ఈ అవకాశాన్ని వెంటనే సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అంగన్వాడి విభాగ అధ్యక్షులుగా పద్మావతి



**భట్టిప్రోలు,పెన్ పవర్ జూలై 14**

మండల కేంద్రమైన భట్టిప్రోలు గ్రామానికి చెందిన కౌతరపు పద్మావతిని అంగన్వాడీ విభాగం అధ్యక్షుగా నియమితులయ్యారు. మాజీ ముఖ్యమంత్రి ఉత్తరువుల మీద వైఎస్ఆర్సిపి నియోజకవర్గ సమన్వయకర్త వరికూ టి అశోక్ బాబు సూచనల మేరకు భట్టిప్రోలు గ్రామ నివాసి ఎంపీటీసీ కౌతరపు పద్మావతి కి భట్టిప్రోలు మండల అంగన్వాడి విభాగ అధ్యక్షులుగా పదవి ఇచ్చినందుకు ఆమెని వారి నివాసములో ఘనంగా శాలువా కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి,వైస్ ఎంపీపీ కౌతరపు పిచ్చియ్య శాస్త్రి,మండల కోఆప్షన్ సభ్యులు ఎస్ నబి ఎంపీటీసీలు గద్దె సుశీల,నన్నేపాముల చంటి,వైఎస్ఆర్సిపి నాయకులు నాగమల్లేశ్వరరావు, సొంటి కామేశ్వరరావు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నోటు పుస్తకాలు అందించిన నారాయణ

**భట్టిప్రోలు, పెన్ పవర్ జూలై, 14**

భట్టిప్రోలు కు చెందిన అయ్యప్ప సాయిరాం స్వీట్ హోమ్ అధినేత గాత్రం నారాయణ మండలంలోని వెల్లటూరు గ్రామంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాల(జి సి) మరియు మండల పరిషత్ పాఠశాల(హెచ్ డబ్ల్యు)పాఠశాలలకు చెందిన (52 మంది)ఒకటవ తరగతి నుండి 5వ తరగతి వరకు చదివే విద్యార్థులకు సంవత్సరమునకు సరిపడా నోట్ పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమమునందు మండల విద్యాశాఖ అధికారి యన్. దేవరాజ్,గ్రామ సర్పంచ్ బొజ్జా రవి,వి. శివ నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు వి. సురేష్ కుమార్,జె పీ పున్నయ్య,యం కృష్ణప్రియ,లక్ష్మీ పాల్గొన్నారు. విద్యార్థులు ఈ అవకాశం ఉపయోగించుకొని బాగా చదువుకొని అభివృద్ధి చెందాలని పెద్దలు సూచించారు.

# మూగజీవాలపై దాడులను ఖండిస్తూ ధర్నా....

**పీపుల్స్ ఫర్ అనిమల్స్ సభ్యులు...**

**కార్పొరేషన్ ఒంగోలు పెన్ పవర్ జూలై 14**

మూగజీవాలను హింసించడం,మూగజీవాలకు అన్నం పెట్టే వాళ్ళ పై జరుగుతున్న దాడులను ఖండిస్తూ పీపుల్స్ ఫర్ యానిమల్స్ ఆధ్వర్యంలో సోమవారం నాడు ఒంగోలు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పీపుల్స్ ఫర్ యానిమల్స్ సభ్యులు విష్ణువర్ధన్ మాట్లాడుతూ మూగజీవాలను హింసించినా, వాటికి అన్నం పెట్టే వారిని బెదిరించినా చట్ట రిత్యా నేరం అని అన్నారు. ఇటీవల భాగ్యనగర్ నాలుగో లైన్, ఐదోవ క్రాస్ రోడ్లో లో రాకేష్ జెట్టి అనే సాఫ్ట్వేర్ ఉద్యోగి కుక్కలకు అన్నం పెడుతున్నాడని ఆ విధి లోని కొందరు అతని ఇంటి పై దాడి చేశారని ఆరోపించారు. దాడికి పాల్పడిన వారిపై ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ నందు ఫిర్యాదు చేసి చట్ట చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరిగింది అని తెలిపారు. ఒక ప్రదేశంలో ఉంటున్నా జంతువులను మరొక ప్రదేశానికి తరలించరాదని ఏ ప్రాంతంలో ఉన్న జీవులను ఆ ప్రాంతంలోనే ఉంచాలని తెలిపారు. జంతువులను రక్షించుకుందాం మూగజీవాలను కాపాడుకుందాం అని నినాదంతో ముందుకు సాగుతున్నామని, ఆపదలో ఉన్న ఏ మూగ జీవలకైనా అత్యవసర సేవలు అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాకేష్ జెట్టి, వాసు చక్రవర్తి, రవి పప్పు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## గుంటూరు ఎస్పీ ఆఫీస్ ఎదుట నిరసనకు దిగిన అంబటి రాంబాబు..

**గుంటూరు, పెన్ పవర్ జూలై 14**

గుంటూరు లో ఎస్పీ ఆఫీస్ ఎదుట సోమవారం నాడు గుంటూరు జిల్లా వైసీపీ అధ్యక్షుడు అంబటి రాంబాబు మరియు మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాల్ రెడ్డి కొందరు వైసీపీ నేతలు నిరసనకు దిగారు. సత్యమేవ జయతే అంటూ వేణుగోపాల్ రెడ్డి ప్లకార్డు పట్టుకోగా నా ఫిర్యాదు పై చర్యలు తీసుకోవాలని ప్రార్థన అంటూ అంబటి రాంబాబు ప్లకార్డు పట్టుకొని నిరసన తెలిపారు. గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై స్పందన లేకపోవడంతో నిరసనగ దిగారు వైసీపీ శ్రేణులు...




పెన్ పవర్
గుంటూరు | బాపట్ల | పల్నాడు

# రాష్ట్రాన్ని జగన్ దివాళా తీయించినా...
# జనం కోసం చంద్రబాబు కష్టపడుతున్నారు

**చంద్రబాబు నాయకత్వమే రాష్ట్రానికి మేలన్న పవన్ వ్యాఖ్యలపై ఆలోచన చేయండి :ప్రత్తిపాటి.**

**గతంలో జరిగిన నష్టాన్ని గుర్తించకుండా ఇంకా దోపిడీదారులకే వంతపాడితే ఎలా? : ప్రత్తిపాటి.**

**ప్రవాసాంధ్రులు.. సంపన్నులు పీ-4లో భాగస్వాములై.. నియోజక అభివృద్ధికి సహకరించాలి : ప్రత్తిపాటి.**

**చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, జూలై 14**

రాష్ట్రాన్ని పాలిస్తున్నది జవాబుదారీ ప్రభుత్వమని, ప్రజలు ఐక్యంగా ఉండి ప్రభుత్వ పథకాలతో పాటు, అభివృద్ధి నిధులు సాధించుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, తూబాడు, జంగాలపల్లి గ్రామాల్లో సోమవారం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు : ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ప్రత్తిపాటి, తూబాడులో రూ.15 లక్షలతో నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజ్ లు, రూ.20.80 లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్ ను ప్రారంభించారు. రూ.6 లక్షలతో నాదెండ్ల పంచాయతీ పరిధిలోని అంబేద్కర్ నగర్ కు వేసే మంచినీటి పైప్ లైన్ పనులకు శంఖుస్థాపన చేసిన అనంతరం ప్రజలనుద్దేశించి ప్రత్తిపాటి మాట్లాడారు.

**జగన్ రాష్ట్రాన్ని దివాళా తీయించినా.. ప్రజల సంతోషం కోసం చంద్రబాబు కష్టపడుతున్నారు**

జగన్ దెబ్బకు పూర్తిగా దివాళా తీసిన రాష్ట్రాన్ని చంద్రబాబు ఏవిధంగా గట్టెక్కిస్తున్నారో, ప్రజల ముఖాల్లో ఆనందం కోసం సంక్షేమపథకాలు ఎలా అమలుచేస్తున్నారో అందరూ ఆలోచించాలని ప్రత్తిపాటి సూచించారు. ప్రతి తల్లి తన బిడ్డల చదువులకోసం పడే కష్టాన్ని గుర్తించే మంత్రి లోకేశ్ అర్హత కలిగిన ప్రతి మహిళకు తల్లికి వందనం ఆర్థికసాయం అందిస్తున్నారని ఎమ్మెల్యే చెప్పారు. జగన్ ఐదేళ్లపాటు ప్రజల ముఖం కూడా చూడలేదని, కానీ చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్ లు ఎప్పుడూ ప్రజల్లోనే ఉంటూ వారి సమస్యలు పరిష్కరిస్తున్నారన్నారు.

**లిఫ్ట్ ల నిర్వహణను ప్రైవేట్ సంస్థకు అప్పగించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తాం..**

నియోజకవర్గంలోని 55 లిఫ్ట్ లను సక్రమంగా నిర్వహించేలా ఒక ప్రైవేట్ సంస్థకు అప్పగించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చేస్తామన్న ప్రత్తిపాటి, జనం అభిప్రాయాల ప్రకారమే నిర్ణయం తీసుకుంటామన్నారు. ఇప్పటికే కాలువలు, వాగులను బాగుచేయడం జరిగిందన్నారు. 2019 ఎన్నికల్లో చేసిన పొరపాటు ప్రజలు మరలా చేయకూడదని, ముక్కూ..ముఖం తెలియనివారికి కొందరు ఓటేస్తే, అందరూ నష్టపోయారని ప్రత్తిపాటి తెలిపారు. ఇప్పటికీ అభివృద్ధి గురించి ఆలోచించకుండా, కొంతమంది దోపిడీదారులకే వంతపాడుతున్నారని, అలాచేసే వారు మరింత నష్టపోతారని ప్రత్తిపాటి స్పష్టంచేశారు.

**చంద్రబాబు నాయకత్వంతోనే రాష్ట్రానికి మేలన్న పవన్ వ్యాఖ్యలపై ఆలోచించండి**

చంద్రబాబు సుదీర్ఘకాలం ముఖ్యమంత్రిగా ఉంటే రాష్ట్రం అభివృద్ధి చెంది భూములధరలు పెరుగుతాయని, పంట ఉత్పత్తులకు మంచి ధరలు లభించి రైతులు బాగుపడతారని ప్రత్తిపాటి పేర్కొన్నారు. నాయకులు.. ప్రజలు ఐక్యంగా లేకపోతే వారితో పాటు భావితరాలు కూడా నష్టపోతాయనే వాస్తవాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. రాష్ట్రం... ప్రజలకోసమే చంద్రబాబు నాయకత్వాన్ని బలపరుస్తున్నాను అన్న పవన్ కల్యాణ్ వ్యాఖ్యలపై అందరూ ఆలోచించాలన్నారు.

**నాదెండ్ల ప్రజలకు ఒక్క నెలలోనే రూ.2కోట్ల లబ్ధికలిగింది..**

ఒక్క నాదెండ్ల గ్రామ ప్రజలకే ఒక నెలలోనే రూ.2కోట్లకు పైగా సంక్షేమ పథకాలు అందించిన ఘనత కూటమిప్రభుత్వానిదని ప్రత్తిపాటి చెప్పారు. ఈ లెక్కన రాష్ట్రంలోఎన్ని గ్రామాలుంటాయో.. ఎందరు ప్రజలకు... ప్రభుత్వం ఎంత సాయం అందిస్తోందో ఆలోచించాలన్నారు. ఆర్థిక సమస్యలున్నా కేవలం ప్రజల సంతోషం కోసమే ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలతో పాటు.. మరెన్నో పథకాలు అమలు చేస్తున్నారని ప్రత్తిపాటి చెప్పారు. నాదెండ్లకు చెందిన ఎన్నారైలు పీ-4లో భాగస్వాములై పేదకుటుంబాలకు అండగా నిలవాలని ప్రత్తిపాటి కోరారు. నియోజకవర్గంలో పేదకుటుంబాలు ఆర్థికంగా బలపడితే, చిలకలూరిపేట అభివృద్ధిలో భాగస్వాములైనట్టేనని ప్రత్తిపాటి స్పష్టంచేశారు. నాదెండ్ల గ్రామం అభివృద్ధిలో ఇతర గ్రామాలకు రోల్ మోడల్ గా నిలవాలంటే ప్రజలంతా ఒకే తాటిపై ఉండాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నెల్లూరి సదాశివరావు, బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, నల్లమోతు హరిబాబు, బసవయ్య, దగ్గుమల్లి సాంబయ్య, యాసిన్, వెంకటేశ్వర్లు, చెన్నుపాటి, నాగేశ్వరరావు, ఇన్నారెడ్డి, జ్ఞాన్ రెడ్డి, రాజు, సౌరెడ్డి, లక్ష్మీ రెడ్డి, కొండలు, గ్రామ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.









## బీసీ భవన్ స్థలాన్ని బీసీలకే కేటాయించాలి

### - వైఎస్ఆర్ కాంగ్రెస్ డిమాండ్






**పెన్ పవర్ నరసరావుపేట ప్రతినిధి జూలై 14**

పల్నాడు జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి సోమవారం నాడు కలెక్టరేట్ ముందు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, నరసరావుపేట జిల్లా కేంద్రమైన తర్వాత బీసీ భవన్ ఏర్పాటు చేయాలని, అన్ని బిసి సామాజిక వర్గాల వారు వచ్చి కోరడం జరిగిందనీ, వారి అభ్యర్థన మేరకు 2022లో కలెక్టర్ ని స్థలం కొరకు అభ్యర్థించగా అప్పటి కలెక్టర్ సూచనల మేరకు ఎమ్మార్వో 15 సెంట్ల స్థలం కేటాయించడం జరిగిందనీ చెప్పారు. అప్పుడు నిధులు సమకూర్చుకునే ప్రయత్నంలో ఉండగా ఎన్నికలు రావడంతో నిధులు కేటాయించలేని పరిస్థితిలో నిర్మాణం పూర్తి చేయలేకపోవడం జరిగిందని అన్నారు. ఇప్పుడు బీసీభవన్ కు కేటాయించిన 15 సెంట్ల స్థలంలో ఐదు సెంట్ల స్థలాన్ని అంగన్వాడీ కేంద్ర బిల్డింగ్ నిర్మాణానికి కేటాయించడం జరిగింది. గతంలో బీసీ భవన్ కొరకు కేటాయించిన స్థలం ఏదైతే ఉందో, అది బీసీ లకే ఉంచాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర బీసీ శాఖ మంత్రివర్యులు సబితమ్మ కూడా ప్రతి జిల్లాకు బీసీ భవన్ ఏర్పాటు చేయాలని వేదిక మీద నుంచి చెప్పడం జరిగిందని, ఈ 15 సెట్ల స్థలాన్ని బీసీ భవన్ కేటాయించాలని, అంగన్వాడీ బిల్డింగ్ కు మరియు తూనికలు కొలతలు శాఖ కు కేటాయించిన స్థలంలో తగ్గించి కొంత స్థలం అంగన్వాడీ బిల్డింగ్ కేటాయించాలని, బీసీ భవన్ స్థలాన్ని అంతే ఉంచాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. ఈ విషయంపై కలెక్టర్ ని సంప్రదించగా కలెక్టర్ కూడా దానికి సానుకూలంగా స్పందించి నిర్ణయం తీసుకుంటామని చెప్పారన్నారు. ఈ రాష్ట్రంలో బీసీలు 50% నుంచి 60% వరకు ఉన్నారు, వారు ఏదైనా సమావేశం పెట్టుకోవాలంటే ఇతర కార్యక్రమాలైనా చేసుకోవాలంటే, జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో బీసీ భవన్ ఉండటం చాలా మంచిది, జిల్లా కేంద్రమైన తర్వాత అనేక ప్రాంతాల నుంచి బీసీలు ఇక్కడికి వస్తుంటారు వారికి ఎంతో అవసరంగా ఉంటుందన్నారు. ఈ బీసీ భవన్ కు నిధులను అప్పట్లో ప్రస్తుత ఎంపీని కూడా అడగటం జరిగిందని అయితే ఎన్నికలు రావడం వల్ల నిధులు కేటాయించలేకపోవడం వల్ల నిర్మాణం ప్రారంభించలేకపోయామన్నారు. రానున్న రోజుల్లో ఆ స్థలంలో బిసి భవన్ బిల్లింగ్ కట్టుకునే కార్యక్రమం చేస్తామనీ, ఇక్కడ ఎమ్మెల్యే కూడా బీసీ వర్గానికి చెందినవారనీ, దయచేసి గతంలో బీసీ భవన్ కు కేటాయించిన స్థలం ఏదైతే ఉందో దాన్ని అధికారులతో మాట్లాడి ఆ స్థలాన్ని బీసీలకు కేటాయించేలాగా మీరు చర్యలు తీసుకోవాలని మా అందరి తరఫున బీసీ సామాజిక వర్గం తరఫున నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఒకసారి స్థలం కేటాయించిన తర్వాత అది వెనక్కి తీసుకుంటే తిరిగి మరలా కేటాయించే కార్యక్రమం జరగదనీ, అందులో నరసరావుపేటలో ప్రభుత్వ స్థలాలు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. గతంలో 34 ఎకరాలు కలెక్టర్ ఆఫీసుకు కేటాయించామని, దానిలో ఎస్పీ ఆఫీసుకి 15 ఎకరాలు ఇచ్చినప్పటికీ, ఇంకా 19 ఎకరాలు కలెక్టర్ ఆఫీస్ నిర్మాణం కొరకు ఉంటుందని అన్నారు. ఇందులో ఈ ఆఫీసులన్నిటికీ స్థలం కేటాయించుకోవచ్చు, బీసీ భవన్ కు సావిత్రిబాయి పూలే పేరు పెట్టాలన్నారు. ఈ స్థలానికి ఫెన్సింగ్ వేసి కాపాడుకోవడం మన అందరి బాధ్యత అన్నారు. త్వరలోనే డిసి భవన్ నిర్మాణం ప్రారంభిస్తామని కాబట్టి బీసీ భవన్ కు కేటాయించిన స్థలాన్ని బీసీల కొరకే ఉంచాలని, ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ని మరియు శాసనసభ్యులు అరవింద్ బాబు ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు షేక్ కరీముల్లా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇంటలెక్చువల్ విభాగం కార్యదర్శి మరియు బీసీ సామాజిక నేత తెలుగు మద్దిలేటి స్వామి మాస్టర్, పట్టణ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మరియు బీసీ సంఘం నేత అచ్చి శివకోటి, మరియు పలువురు బీసీ సామాజిక వర్గాల నేతలు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు ఆకలి నివారించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యం-ఆనందబాబు

**భట్టిప్రోలు,పెన్ పవర్ జూలై 14**

పేద ప్రజలకు ఆకలి తీర్చటమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్న కూటమి ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన నాటినుండి రాష్ట్రంలో 113 నియోజకవర్గాల్లో కొనసాగుతున్న అన్నా క్యాంటీన్లను ప్రతి నియోజకవర్గానికి విస్తరించేందుకు కృషి చేస్తోందని వేమూరు నియోజకవర్గ శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రమైన భట్టిప్రోలు లో మానేపల్లి వారి ధర్మ చెరువు స్థలములో అన్నా క్యాంటీన్ భవన నిర్మాణానికి ఎమ్మెల్యే ఆనందబాబు శంకుస్థాపన చేశారు. అనంతరం జరిగిన సభకు రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా అధ్యక్షత వహించారు. శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే ఆనందబాబు మాట్లాడుతూ అక్టోబర్ రెండవ తేదీ నాటికి భవన నిర్మాణం పూర్తి కావాలనే ఉద్దేశం ఆయన కాంట్రాక్టర్కు తెలిపారు. ఈ నిర్మాణాన్ని పూర్తి చేసే విధంగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. 2019 వ సంవత్సరంలోనే అన్నా క్యాంటీన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టామని పనులు ప్రారంభం కానున్న దశలో ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రం మొత్తం మీద ఉన్న క్యాంటీన్లను వైసీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేసిందన్నారు. ప్రక్కన ఉన్న తమిళనాడు రాష్ట్రంలో జయలలిత ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో చేసిన కార్యక్రమాలను ప్రస్తుత ప్రభుత్వం కంటిన్యూ చేస్తుందని ఎమ్మెల్యే గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వ సమయంలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిన ఘనత వైయస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి రాష్ట్రంలో అన్నా క్యాంటీన్లు పేద వర్గాలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దుతున్నామని అదేవిధంగా భట్టిప్రోలు బడుగు బలహీన వర్గాలు ఉన్న ప్రాంతం అనే ఉద్దేశంతో వేమూరు నియోజకవర్గంలో ప్రథమ స్థానం భట్టిప్రోలు కేటాయించడం జరిగిందని రానున్న రోజుల్లో మరో చోట నిర్మాణం చేస్తామని ఆయన పేర్కొన్నారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం పేద వర్గాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అన్నా క్యాంటీన్ కు ఐదు సెంట్లు స్థలం ఇచ్చిన మానేపల్లి కుటుంబ సభ్యులను తూనుగుంట్ల సాయిబాబా సూచనల మేర ఎమ్మెల్యే ఆనందబాబు స్థల దాతలకు శాలువాలు కప్పి సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ము మ్మనేని వెంకటసుబ్బయ్య వేమూరు నియోజకవర్గ పార్టీ పరిశీలకులు వంగా సామిరెడ్డి వేమూరు మార్కెటింగ్ యాడ్ చైర్పర్సన్ గొట్టిపాటి జయ వెంకట పూర్ణ కుమారి జెడ్పిటిసి తిరువేదుల ఉదయభాస్కరి,వాకా శేషుబాబు,భట్టిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు,మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## 'గోడ' దూకిన సీఎం.. ఆ రాష్ట్రంలో హీటెక్కిన అమరుల సంస్మరణ రాజకీయం



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే ఆ రాష్ట్రం చాలా భిన్నం.. అసలు అక్కడ ప్రజలకు ఆధార్ కార్డు ఉండదు.. ఏమాత్రం పరిస్థితులు ఉద్రిక్తంగా మారినా ఆంక్షలు అమల్లోకి వచ్చేస్తాయి.. ఇలాంటి రాష్ట్రంలో గత ఏడాది ఎన్నికలు జరిగాయి.. కాంగ్రెస్ తో పొత్తు పెట్టుకున్న పార్టీ విజయం సాధించి.. అధికారం చేపట్టింది.కశ్మీర్ లో రాజకీయం వేడెక్కింది. ఫలితంగా మళ్లీ వార్తల్లో నిలిచింది. ఆ రాష్ట్ర అమరవీరుల దినోత్సవం సాక్షిగా రగడ మొదలైంది. ఈ దినోత్సవం పాటించకుండా అధికార, ప్రతిపక్ష నేతలపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా ఆంక్షలు విధించడం వివాదానికి దారితీస్తోంది. ఈ మేరకు హౌస్ అరెస్టులు, ఆంక్షలు విధించడాన్ని కశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇప్పటికే ఖండించారు. కేంద్ర ప్రభుత్వం తీరు సిగ్గుచేటని కూడా మండిపడ్డారు.బ్రిటిష్ పాలనలో ఉండగా.. 1931 జూలై 13న అప్పటి కశ్మీర్ రాజు హరిసింగ్ కు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న వారిపై బ్రిటిష్ సైనికులు కాల్పులు జరిపారు. ఇందులో 21 మంది చనిపోయారు. వీరి సంస్మరణను ఒమర్.. మరో జలియన్ వాలాబాగ్ గా అభివర్ణించారు. ముస్లింలు అయినందుకే వారిని విలన్ లుగా చిత్రీకరిస్తున్నారని మండిపడ్డారు. అలాంటివారి సమాధులను సందర్శించే అవకాశం ఇవ్వకపోవడాన్ని తప్పుబట్టారు.కశ్మీర్ అమరవీరుల దినోత్సవం పాటించకుండా.. లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా యంత్రాంగం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలను హౌస్ అరెస్టు చేయించింది. ప్రతిపక్ష నేతలను కూడా అనుమతించలేదు. జూలై 13న ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని ఆదేశాలిచ్చారు. రాజధాని శ్రీనగర్ లోని పలు ప్రాంతాల్లో ఆంక్షలు విధించారు. మజార్-ఎ-షుహాదా (అమరుల శ్మశానవాటిక)కు వెళ్లేందుకు అనుమతి నిరాకరించింది. తమ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.దీనిని ఉల్లంఘిస్తూ.. సీఎం ఒమర్ అబ్దుల్లా.. మజార్-ఎషుహాదా (అమరుల శ్మశాన వాటిక) గోడను దూకారు. ఆయన ప్రార్థనలు చేయడానికి వెళ్తుండగా భద్రతా దళాలు అడ్డుకున్నాయి. దీంతో సీఎం స్వయంగా మజార్-ఎ-షుహాదా గోడ ఎక్కి లోపలకు దూకారు. అమరవీరులకు నివాళి అర్పిస్తూ ప్రార్థనలు చేశారు. ఈ మేరకు వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

## ట్రోల్స్ చిక్కుల్లో పవన్ కల్యాణ్ ..!



**హైదరాబాద్ పెన్ పవర్:** జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో ట్రోల్స్ ను ఎదుర్కొంటున్నారు. ఆయన చేస్తున్న ప్రసంగాలు, తీవ్ర విమర్శలు వంటివి నెటిజన్లకు ఆటపట్టుగా మారాయని చెప్పాలి. ఒక్కొక్క సందర్భంలో ఒక్కొక్క రకంగా మాట్లాడుతున్న పవన్ కళ్యాణ్ వ్యవహార శైలి నిజానికి.. జనసేన నాయకులకు కూడా మింగుడు పడడం లేదనే చెప్పాలి. ఏదైనా ఒక విషయంపై మాట్లాడాల్సి వచ్చినప్పుడు చాలా జాగ్రత్తగా మాట్లాడాలి. అదేవిధంగా గతంలో మాట్లాడిన మాటకు ప్రస్తుతం మాట్లాడే మాటకు మధ్య పొంతన ఉండేలా చూసుకోవాలి.కానీ, ఈ విషయంలో పవన్ కళ్యాణ్ చాలా సందర్భాల్లో దారి తప్పుతున్నారనేది నెటిజన్లు చేస్తున్న ట్రోల్స్ ను బట్టి స్పష్టంగా తెలుస్తోంది. గతంలో హిందీ భాష పై తీవ్ర విమర్శలు గుప్పించిన పవన్ ఇటీవల కాలంలో మాత్రం హిందీని ప్రశంసిస్తున్నారు. బిజెపిని భారతీయ జనతా పార్టీ కాదని అది హిందీ జనతా పార్టీ అని పేర్కొన్న పవన్ కళ్యాణ్ గత ఎన్నికల సమయంలో బిజెపితో పొత్తు పెట్టుకుని ఎన్నికలకు వెళ్లారు. దీనిపై అప్పట్లోనే ట్రోల్స్ వచ్చాయి. ఇక ఇటీవల కాలంలో హిందీని ఆయన పూర్తిగా భుజాల మీద ఎక్కించుకున్న పరిస్థితి ఉంది.

బిజెపి నాయకుల కంటే ఎక్కువగా కూడా పవన్ కళ్యాణ్ హిందీ ప్రచారం చేస్తున్నారనే మాట సోషల్ మీడియాలో ఎక్కువగా వినిపిస్తోంది. హిందీని ఒకప్పుడు విమర్శించిన పవన్ కళ్యాణ్ ఇప్పుడు హిందీ నేర్చుకుంటే తప్పేముంది.. దీనివల్ల మనకి కమ్యూనికేషన్ పెరుగుతుందని చెప్పుకొస్తున్నారు. త్రిభాషా సూత్రాన్ని సమర్థిస్తున్నారు. ఒకప్పుడు ఇదే పవన్ కళ్యాణ్ త్రిభాషా సూత్రాన్ని తీవ్ర స్థాయిలో ఎండగట్టారు. విమర్శించారు. బీజేపీ నాయకులపై తీవ్రస్థాయిలో విమర్శలు కూడా గుర్తించారు.కానీ.. ఇప్పుడాయన దాన్ని సమర్థిస్తున్నారు. ఇక, సనాతన ధర్మం విషయానికి వస్తే ఈ విషయంలో కూడా పవన్ కళ్యాణ్ విమర్శలు పాలయ్యారు. ఒకప్పుడు తనకు మతం లేదని కులం లేదని తాను సిద్ధాంతాలకు మాత్రమే విలువ ఇస్తానని చెప్పారు. ఈ క్రమంలోనే చేగువేరా.. లెనిన్ వంటి వారిని తనకు ఆదర్శంగా చెప్పుకొచ్చారు. అంతేకాదు తన ఇంట్లో తల్లి మాత్రమే పూజలు చేస్తారని తన తండ్రి సనాతన ధర్మానికి వ్యతిరేకంగా ఉంటారని ఆయన పలు సందర్భాల్లో 2014-19 చెప్పుకొచ్చారు.కానీ, తిరుపతి లడ్డు విషయంలో కావచ్చు తిరుపతిలో జరిగిన తొక్కిసలాట అంశంలో కావచ్చు ఆయన పూర్తిగా సనాతన ధర్మానికి మద్దతిస్తూ కాషాయ వస్త్రాలు ధరించి ఏకంగా దీక్ష కూడా చేశారు. ఈ పరిణామం కూడా పవన్ కళ్యాణ్‌ను ట్రోల్స్‌కు గురయ్యేలా చేసింది. ఇక మరో ముఖ్య విషయం.. తను పుట్టి పెరిగిన ప్రాంతానికి సంబంధించి ఒక్కొక్క వేదికపై ఒక్కొక్క రకంగా చేస్తున్న వ్యాఖ్యలు కూడా నటిజెన్లకు ఆటవిడుపుగా మారింది. ఎక్కడికి వెళ్తే అక్కడ ఆయన నేనిక్కడ పుడితే బాగుండేది అని వ్యాఖ్యానించడం.. గతంలో తను కర్నూల్ లో పెరిగానని, నెల్లూరులో పుట్టానని, పాలకొల్లులో చదివానని ఇట్లా రకరకాలుగా ఒక సంబంధం లేనటువంటి వ్యాఖ్యలు చేయడం పట్ల నెటిజన్లు పదేపదే ట్రోల్స్ చేస్తున్నారు.%--%సరే దీనివల్ల ఏం జరుగుతుంది? ఏదో మా నాయకుడు ఇలా అన్నంత మాత్రాన మాకు ఒరిగేది ఏంటి%--% అని కొంతమంది జనసేన నాయకులు అనుకుంటే అనుకుని ఉండొచ్చు. కానీ, ఒక కీలక పార్టీకి అధినేతగా ఉన్న వ్యక్తి, పదేపదే ఇలా ట్రోల్స్‌కు గురి అయితే రేపు ప్రజల్లో ఆయన పట్ల వ్యతిరేక భావన పెరిగే అవకాశం ఉంటుందన్నది పరిశీలకుల అంచనా. కాబట్టి, భవిష్యత్తులో మాట్లాడేటప్పుడు గానీ, ప్రసంగాలు చేసేటప్పుడు గాని ఒకటికి రెండుసార్లు ఆలోచించుకుని అడుగులు వేయాల్సిన అవసరం ఉంది. ఒక పార్టీ అధినేతగా పవన్ కు ఇది చాలా ముఖ్యమైనది పరిశీలకుల భావన.

# విలక్షణ నటనకు పెట్టని కోట!



**హైదరాబాద్ పెన్ పవర్:** వెండితెరపై విలక్షణమైన నటనని ప్రదర్శించే నటులు చాలా ఆరుదు. ఒక్కో నటుడికి ఒక్కో ప్రత్యేకత ఉంటుంది. అయితే నటనకు పెట్టని కోటగా పేరు తెచ్చుకున్న కోట శ్రీనివాసరావు మాత్రం ఇందుకు భిన్నం. ఎందుకంటే కమెడియన్‌గా నవ్వులు పూయించగలడు..అదే టైమ్‌లో కర్కశమైన విలనిజాన్ని ఒలికించగలడు..తండ్రిగా, తాతగా తనదైన మార్కు నటనతో ఆకట్టుకోగలడు. కంటతడి పెట్టించగలడు. హలో బ్రదర్‌లో తన సహాయకుడిని టార్చర్ చేసే పాత్రలో కనిపించినా చివరికి కంటతడి పెట్టించారు.

**మండలాదీశుడు - తో వివాదాల్లోకి...**

గణేష్%-%లో విలనిజానికి సరికొత్త భాష్యం చెప్పి ఔరా అనిపించారు. %-%మండలాదీశుడు%-%లో కోట చేసిన పాత్ర ఆయన నట ప్రస్థాన్ని మరో మలుపు తిప్పింది. కెరీర్ ప్రారంభంలో ఇలాంటి సాహసోపేతమైన పాత్రలో కోట కనిపించడం చర్చనీయాంశం అయింది. ఆయనకున్న గట్స్‌కు ఈ క్యారెక్టర్ నిదర్శనంగా నిలిచి అందరిని ఆశ్చర్యపరిచింది. ఇది నందమూరి తారాక రామారావు పారడీ సినిమా. ఇందులో ఎన్టీఆర్ క్యారెక్టర్‌ని పోలిన పాత్రలో కోట నటించి తనదైన మార్కు నటనతో షాక్ ఇచ్చారు.

ఈ సినిమా వచ్చే నాటికి లెజెండరీ నటుడు, స్వర్గీయ ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్నారు. అలాంటి సందర్భంలో కోట ఆయన క్యారెక్టర్‌ని పోట్రే చేయడం అంటే మామూలు విషయం కాదు. ఓ కొత్త నటుడు ఎన్టీఆర్ క్యారెక్టర్‌ని చేయాలంటే చాలా గట్స్ ఉండాలి. అందులోనూ ఎన్టీఆర్‌ని నెగెటివ్‌గా చూపించే క్యారెక్టర్. రేపు దీని వల్ల తన కెరీర్ ఏమౌతుందో తెలియదు. ఇది తెలిసి కూడా కోట -మండలాదీశుడు - లో నటించడం అప్పట్లో పెద్ద చర్చకు దారితీసింది. కోట ఈ క్యారెక్టర్‌ని తెలిసి చేశారో తెలియక చేశారో తెలియదు కానీ చాలా బ్రిలియంట్‌గా ఆ పాత్రకు ప్రాణం పోశారు.

అయితే ఈ సినిమాలో నటించడం వల్ల అప్పట్లో కోట శ్రీనివాసరావు కెరీర్ పరంగా ఎన్నోఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. లెజెండరీ నటుడు ఎన్టీఆర్ హార్డ్ కోర్ ఫ్యాన్స్ కారణంగా కోటకు అవకాశాలు రావడం గగనంగా మారింది. ఎంతగా అంటే అభిమానులు కోటకు చుక్కలు చూపించేంత. ఒక సందర్భంలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో రైలు కోసం ఎదురు చూస్తున్న క్రమంలో ఎన్టీఆర్ అభిమానుల ఆగ్రహం ఎలా ఉంటుందో కోటకు తెలిసి వచ్చింది. అయితే అలా తనని ద్వేషించిన విజయవాడలోనే కోట ఎమ్మెల్యేగా గెలవడం విశేషం. ఒకానొక సందర్భంలో %-%మండలాదీశుడు%-% కారణంగా తాను ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొన్నాడో తన సన్నిహితులు, ఫ్రెండ్స్ దగ్గర కోట బయటపడ్డారట. చాలా విపత్కర పరిస్థితుల్ని ఫేస్ చేశానని వాపోయారట. ఇంతగా ఎన్టీఆర్ అభిమానుల నుంచి ఇబ్బందుల్ని ఎదుర్కొన్న కోటకు అన్నగారి నుంచి మాత్రం ప్రశంసలు దక్కాయట. ఒకానొక సందర్భంలో కోట .. ఎన్టీఆర్‌ను కలిశారట. ఆ సందర్భంగా ఆయన అన్నమాటలు కోట ఎలాంటి నటుడో ప్రపంచానికి తెలిసింది. నువ్వు అద్భుతమైన నటుడివని నేను విన్నాను%-% అని ఎన్టీఆర్ అన్నారట. ఆ మాటలు విన్న కోట వెంటనే కిందికి వంగి ఎన్టీఆర్ కాళ్లకు వినయంగ నస్కరించారట.

**బహుముఖ ప్రజ్ఞాశాలి...**

నటనకు పెట్టని కోటగా పేరు తెచ్చుకున్న కోట ఓ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఎంచుకున్న ప్రతిపాత్రలోనూ తనదైన ముద్ర వేస్తూ ప్రత్యకతను చాటుకుంటూ ప్రత్యేక గుర్తింపుని సొంతం చేసుకున్నారు. ప్రతిఘటన, గాయం, గణేష్ వంటి సినిమాల్లో తెలంగాణ యాసలో ఆయన పలికించిన విలనీ ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకుంది. శత్రువు, సర్కార్ వంటి సినిమాల్లో తనదైన విలక్షణమైన విలనీని ప్రదర్శించి ఇలాంటి పాత్రలు కోటకే సాధ్యం అనిపించారు.

విలనిజాన్ని ఏ స్థాయిలో పండించారో కామెడీని కూడా అదే స్థాయిలో పండించి ఇలా భిన్నమైన క్యారెక్టర్లకు పెట్టని కోట అనిపించుకున్నారు. కామెడీ క్యారెక్టర్లలో హలో బ్రదర్, మనీ, అహనా పెళ్లంట, గోవిందా గోవిందా వంటి సినిమాల్లో కనిపించి అలరించారు. డార్క్ కామెడీ, స్లాప్‌స్టిక్ కామెడీ రోల్స్‌తో ఫ్రెష్ కామెడీని అందించారు. కోట రెగ్యులర్ క్యారెక్టర్లకు భిన్నంగా అతడు, ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు, రేపటి పౌరులు, అనగనగ ఒకరోజు వంటి తదితర సినిమాల్లో కనిపించారు. విలన్ పాత్రల నుంచి కామెడీకి, కామెడీ నుంచి సెటైరికల్, సెంటిమెంట్ క్యారెక్టర్లకు ..ఇలా విభిన్నతను చూపించి నటుడిగా ఎవరూ చేయలేని పాత్రల్లో కనిపించి అందరు అవాక్కయ్యేలా చేశారు. ఏ పాత్ర చేసినా అది చిన్నదా పెద్దదా అని కాకుండా దానికి తాను ఎంత వరకు న్యాయం చేశాననే కోణంలో ఆలోంచేవారే కానీ ఏనాడూ చిన్న క్యారెక్టర్ అని ఫీలవలేదు.

**కోట నాన్ లోకల్ నినాదం..**

కోటకు చాటున మాట్లాడటం తెలియదు. ఏది మాట్లాడినా స్ట్రెయిట్ ఫార్వర్డ్‌గానే మాట్లాడే తత్వం కోట సొంతం. సొంత భాషకు చెందిన నటీనటులని పక్కన పెట్టి పరభాషా నటులకు అవకాశాలు పెరుగుతున్న క్రమంలో కోట తన గళాన్ని బలంగా వినిపించారు. ఏ వేదిక లభించినా మన వాళ్లని చులకనగా చూస్తున్నారని, మన వాళ్లని పక్కన పెట్టి ప్రాంప్టింగ్ ఇస్తూ భాష తెలియని వాళ్లకు అవకాశాలు ఇస్తున్నారని ఇండస్ట్రీ వర్గాలని ఓపెన్‌గా నిలదీసిన తత్వం కోటది. ఏ భాషలోకి వెళ్లిన స్థానికులకే పెద్ద పీట వేస్తున్నారని, కానీ మన వాళ్లు మాత్రం ఇతర భాషల నటీనటులకు, టెక్నీషియన్‌లకు అవకాశాలు ఇస్తున్నారని నిలదీశారు. భాష రాని వాళ్లకు ఎందుకు అవకాశాలు ఇస్తున్నారని, దాని వల్ల మన వాళ్లు అవకాశాలు కోల్పోతున్నారని ధ్వజమెత్తారు. దీంతో కోట నాన్ లోకల్ నినాదం అప్పట్లో చర్చనీయాంశంగా మారింది. అయితే కోట మాత్రం తమిళం, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో కీలక పాత్రల్లో నటించి అక్కడ కూడా మంచి పేరు తెచ్చుకోవడం విశేషం.

**విమర్శలు ఎదుర్కొన్న చోటే...**

మండలాదీశుడు%-% సినిమా కోటకు ఒక దశలో నైట్ మేర్‌గా మారింది. ఇందులో స్వర్గీయ నందమూరి తారక రామారావు పాత్రలో కనిపించి ఆశ్చర్యపరిచారు. ఎన్టీఆర్ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేస్తున్న సమయంలోనే ఆయనని నెగెటివ్‌గా పోట్రే చేస్తూ ఈ మూవీ చేశారు. అలా ఆ నెగెటివ్ క్యారెక్టర్‌లో భీమ్ రావుగా కోట నటించారు. బ్రతికున్న వ్యక్తి క్యారెక్టర్ కదా హిట్ అయితే మంచి పేరొస్తుందని నటించారట. అదే ఆయనకు తీవ్ర ఇబ్బందుల్ని తెచ్చి పెట్టింది. ఏడాది పాటు సినిమాలు లభించక తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొన్నారు. విజయవాడలో %-%మండలాదీశుడు%-%లో నటించిన కారణంగా అవమానాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. పెద్ద సంఖ్యలో విజయవాడ రైల్వే స్టేషన్‌లో గుమిగూడిన ఎన్టీఆర్ అభిమానుల ఆగ్రహాన్ని కోట రుచి చూడాల్సి వచ్చిందట. అయితే విమర్శలు, చీత్కారాలు ఎదుర్కొన్న చోటే కోట ఎమ్మెల్యేగా గెలిసి అందరిని ఆశ్చర్యపరిచారు. భారతీయ జనతా పార్టీ తరుపున విజయవాడ వెస్ట్ నుంచి పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తరువాత రాజకీయాల్లో ఎక్కువ కాలం కొనసాగలేక సినిమాలకే పరిమితమయ్యారు.

**దేవుడు అన్నీ ఇచ్చాడు కానీ...**

నటుడిగా కోట ఎన్నో మైలురాళ్లని అధిరోహించారు కానీ బ్రతుకు సాగరంలో మాత్రం వెనబడిపోయారు. భార్య రుక్మినికి 1973లో డెలివరీ అయినప్పుడు ఆమె తల్లి మరణించారట. ఆ షాక్ కారణంగా తను 30 ఏళ్ల పాటు తనని గుర్తు పట్టలేదని, మానసిక కుంగుబాటుకు గురైందని ఓ సందర్భంలో కోట చెప్పారు. ఓ ప్రమాదంలో కూతురు కాలు కోల్పోయింది. ఆ తరువాత పెళ్లి కుదిరి సంతోషంగా ఉన్న సందర్భంలోనే ఆయన తనయుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం కోటను మానసికంగా కృంగదీసింది.

ఈ విషాదాల గురించి కోట ఓ సందర్భంలో ఇలా చెప్పుకొచ్చారు. దేవుడు నాకు అన్నీ ఇచ్చాడు. ఫేమ్‌ని, డబ్బుని అందించాడు. అయితే నా మానసిక ప్రశాంతతను మాత్రం తీసుకుపోయాడు. నా కొడుకుని తీసుకుపోయాడు. నా కూతురుని అవిటి దాన్ని చేసి ఎంతో శోకాన్నిచ్చాడు. ఈ సందర్భంగా ఆ దేవుడిని ఒక్కటే ప్రార్థిస్తున్నా.. వచ్చే జన్మలో అయినా నాకు ప్రశాంతమైన వ్యక్తిగత జీవితాన్ని అందించమని%-% అన్నారు.

# పుంగనూరు తమ్ముళ్ల అసంతృప్తి.. ఏం జరుగుతోంది ..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని కీలకమైన నియోజకవర్గం పుంగనూరు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా కూటమి పార్టీలకు ప్రజలు అనుకూలంగా ఓటు వేసినా పుంగనూరు నియోజకవర్గంలో మాత్రం వైసిపి విజయం దక్కించుకుంది. మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పుంగనూరు నియోజకవర్గంలో మరోసారి వరుస విజయాలు దక్కించుకున్నారు. నిజానికి రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నియోజకవర్గాలకు పుంగనూరు నియోజకవర్గానికి భిన్నమైన వాతావరణం ఉంది. గడిచిన ఎన్నికల్లో రామచంద్రారెడ్డి పేరుతో దాదాపు నలుగురి నుంచి ఐదుగురు వరకు పోటీలు చేశారు. అంటే ఒక రకంగా రామచంద్రారెడ్డిని ఓడించాలన్నది అన్ని పార్టీల ధ్యేయం. అయినప్పటికీ ఆయన విజయం సాధించారంటే ప్రజల్లో ఆయనకు ఉన్నటువంటి బలం కావచ్చు, లేదా ఎన్నికల మేనేజ్మెంట్ పై ఆయనకు ఉన్న పట్టు కావచ్చు. ఏదైనా కూడా పుంగనూరు నియోజకవర్గంలో పెద్దిరెడ్డి మరోసారి విజయం సాధించారు. కానీ ఆయన విజయం ఎలా ఉన్నా.. పెద్దిరెడ్డి వ్యవహారంపై మాత్రం టిడిపి నాయకులు అంతర్గతంగా ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నారు.

వైసీపీ అధికారంలో ఉండగా పుంగనూరులో టిడిపి జెండా కనిపించడానికి వీల్లేదు అన్నట్టుగా పెద్దిరెడ్డి వ్యవహరించాలని, కనీసం కార్యక్రమాలు చేసుకునేందుకు కూడా అనుమతులు ఇవ్వలేదని, టిడిపి జెండా కనిపిస్తే చాలు జైలుకే అన్నట్టుగా పోలీసులు సైతం తమపై ఉక్కు పాదం మోపారని చెబుతున్నా రు. అటువంటి నియోజకవర్గంలో ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఉన్నా.. కూడా ప్రశాంతంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వర్గీయులు అనుచరులు కార్యకలాపాలు నిర్వహించుకుంటున్నారు అన్నది టిడిపి నాయకులు అంతర్గత సంభాషణలో చేస్తున్న వ్యాఖ్యలు.ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడాన్ని వారు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఉన్నట్టుండి పెద్దిరెడ్డిని అరెస్టు చేయమని గాని పెద్దిరెడ్డిపై లేనిపోని కేసులు పెట్టమని కోరడం కానీ వారి విధానం కాదు. కానీ తమను ఇబ్బంది పెట్టిన పెద్దిరెడ్డి వర్గీయులు ప్రశాంతంగా కార్యక్రమాలు చేసుకుంటుంటే కూటమి ప్రభుత్వం నాయకులు చోద్యం చూస్తున్నారనేది వారి వాదన. నిజానికి పుంగనూరులో ఒకప్పుడు టిడిపి కార్యక్రమాలు గాని టిడిపి జెండా ఎగరడం కానీ లేదనేది వారు మరోసారి గుర్తు చేస్తున్నారు. పుంగనూరు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరాలి అంటే ప్రాణాలు పోయే పరిస్థితిని కూడా ఎదిరించి గత ఎన్నికల్లో పార్టీ కోసం పనిచేశామని చెబుతున్నారు.

ఇప్పుడైనా పార్టీ బలోపేతం కావాలంటే పార్టీ పుంజుకోవాలంటే పెద్దిరెడ్డిని సైలెంట్ చేసే కార్యక్రమాలకు తెరతీయాలని వారు సూచిస్తున్నారు. ఇలాగే వదిలేస్తే పుంగనూరులో టిడిపి ఎప్పటికీ బలపడటం అనేది కష్టం అని చెబుతున్నారు. ఇదే విషయంపై తాజాగా ఆదివారం భేటీ అయిన స్థానిక నాయకులు కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న తీరును విమర్శలు గుర్తించారు. పెద్దిరెడ్డి పై మదనపల్లి ఫైళ్ల కేసుతోపాటు అటవీ భూముల కేసు కూడా ఉందని కానీ అవి ఏవీ పైకి రాకుండా ఎందుకు తొక్కి పెడుతున్నారు అనేది వారు అడుగుతున్న ప్రశ్న. ఏది ఏమైనా ప్రస్తుతం పుంగనూరు నియోజకవర్గంలో టిడిపి నాయకులు కూటమి ప్రభుత్వంపై స్థానికంగా ఉన్న నాయకత్వంపై కూడా ఒకంత అసంతృప్తితోనే ఉన్నారనేది వాస్తవం.

### బవుమాకు బ్యాడ్‌లక్: టెస్ట్ ఛాంపియన్
# ఫైనల్ హీరోకి ఐసీసీ అవార్డు



**హైదరాబాద్ పెన్ పవర్:** సౌతాఫ్రికా స్టార్ ఓపెనర్ ఐడెన్ మార్క్రమ్ జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకున్నాడు. నామినీలుగా ఎంపికైన తన దేశానికే చెందిన టెంబా బావుమా, శ్రీలంక ఓపెనర్ పాతుమ్ నిస్సాంకలను ఓడించి ఈ అవార్డు సొంతం చేసుకున్నాడు. "ఈ అవార్డు అందుకోవడం ఒక గౌరవం. సౌతాఫ్రికా ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ విజయంలో కీలక పాత్ర పోషించినందుకు చాలా సంతోషంగా ఉంది. లార్డ్స్‌లో ఫైనల్ గెలవడం సౌతాఫ్రికాకు ఒక చారిత్రాత్మక క్షణం. ఇది మనమందరం ఎప్పటికీ గుర్తుండిపోయే విషయం" అని మార్క్రామ్ అవార్డు గెలుక్కుకున్నాక తెలిపాడు.
ప్రతిష్టాత్మకమైన ఐసీసీ టెస్ట్ ఛాంపియన్ షిప్ (2023-25)ను సౌతాఫ్రికా గెలుచుకోవడంలో మార్క్రమ్ కీలక పాత్ర పోషించాడు. సూపర్ సెంచరీతో (207 బంతుల్లో 136: 14 ఫోర్లు) సఫారీ జట్టుకు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. మార్క్రమ్ ప్రదర్శనకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు లభించడంతో తాజాగా జూన్ నెలకు గాను ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు లభించింది. మహిళా విభాగంలో వెస్టిండీస్ స్టార్ ప్లేయర్ హేలీ మాథ్యూస్ జూన్ నెలకు గాను మహిళా ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డు గెలుచుకుంది. ఆస్ట్రేలియా స్టార్ ఆల్ రౌండర్ ఆష్లీ గార్డనర్ తర్వాత నాలుగుసార్లు ఐసీసీ ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును గెలుచుకున్న రెండో ప్లేయర్ గా నిలిచింది. జూన్‌లో హేలీ మాథ్యూస్ అసాధారణంగా రాణించింది. సౌతాఫ్రికా మహిళలతో జరిగిన మూడు వన్డేల్లో 104 పరుగులు చేసిన ఆమె, సిరీస్‌లో నాలుగు వికెట్లు కూడా పడగొట్టింది. "ప్లేయర్ ఆఫ్ ది మంత్ అవార్డును మళ్ళీ అందుకోవడం గౌరవంగా ఉంది. ఇటీవల నా ఫామ్‌తో నేను సంతోషంగా ఉన్నాను. నా ప్రదర్శన జట్టు విజయానికి తోడ్పడడం నాకు సంతృప్తిని ఇస్తుంది. వ్యక్తిగతంగా ఈ జట్టుతో నేను ఇంకా చాలా సాధించాలనుకుంటున్నాను". అని హేలీ మాథ్యూస్ అవార్డు గెలుచుకున్నాక తెలిపింది.

# ఇంగ్లాండ్ చీప్ ట్రిక్స్.. పరుగు తీస్తుంటే జడేజాను అడ్డుకున్న కార్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** లార్డ్స్ వేదికగా జరుగుతున్న ఇండియా, ఇంగ్లాండ్ ప్లేయర్ల మధ్య గొడవలు కొనసాగుతున్నాయి. ఐదో రోజు ఆటలో భాగంగా టీమిండియా ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా, బ్రైడాన్ కార్స్ మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఐదో రోజు తొలి సెషన్ లో జడేజా సింగిల్ తీసే క్రమంలో జడేజా ఇంగ్లాండ్ ఫాస్ట్ బౌలర్ కార్స్ ను ఢీ కొట్టాడు. వెనక్కి చూస్తూ జడేజా పరిగెత్తడంతో కార్స్ భుజంను తగిలాడు. అయితే ఈ సమయంలో కార్స్ కావాలనే పరుగులు తీస్తున్న జడేజాను వెనక్కి లాగినట్టు స్పష్టంగా తెలుస్తుంది. కార్స్ ఉద్దేశ్యపూర్వకంగా చేసిన ఈ పని జడేజాకు నచ్చలేదు. ఇంగ్లాండ్ బౌలర్ పై సీరియస్ అయ్యాడు. జడేజా మాటలకు కార్స్ మీదకి దూసుకొచ్చాడు. దీంతో ఇద్దరి మధ్య కాసేపు తీవ్ర వాగ్వాదం జరిగింది. గొడవ పెద్దది కావడంతో ఇంగ్లాండ్ కెప్టెన్ స్టోక్స్ వచ్చి వీరి వాగ్వాదాన్ని ఆపేందుకు ప్రయత్నించాడు. ఈ ఉద్రిక్తతను తగ్గించడానికి మైదానంలో ఉన్న అంపైర్లు కూడా జోక్యం చేసుకోవలసి వచ్చింది. నితీష్ కుమార్ తో జడేజా భాగస్వామ్యం నెలకొల్పుతున్న సమయంలో ఇంగ్లాండ్ ఆటగాడు భారత ఆటగాళ్ల ఏకాగ్రత చెడగొట్టడానికే ఈ పని చేశారని నెటిజన్స్ ఆరోపిస్తున్నారు.
ఈ మ్యాచ్ విషయానికి వస్తే 193 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో ఓటమి దిశగా పయనిస్తోంది. ఐదో రోజు లంచ్ సమయానికి టీమిండియా 8 వికెట్ల నష్టానికి 112 పరుగులు చేసింది. క్రీజ్ లో జడేజా (17) ఉన్నాడు. టీమిండియా గెలవాలంటే మరో 81 పరుగులు చేయాలి. మరోవైపు ఇంగ్లాండ్ విజయానికి రెండు వికెట్లు కావాలి. జడేజా అద్భుతంగా చేస్తే తప్ప ఈ మ్యాచ్ లో టీమిండియా ఓటమి ఖాయంగా మారింది.

# లార్డ్స్ టెస్టులో దూకుడు.. మహమ్మద్ సిరాజ్‌పై ఐసీసీ చర్యలు

**మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధిస్తూ ఐసీసీ నిర్ణయం**
**సిరాజ్ ఖాతాలో 1 డీ-మెరిట్ పాయింటును చేర్చిన ఐసీసీ**
**రెండేళ్లలో సిరాజ్‌కు రెండో డీ-మెరిట్ పాయింటు**



**హైదరాబాద్ పెన్ పవర్:** భారత పేసర్ మహమ్మద్ సిరాజ్‌కు మ్యాచ్ ఫీజులో 15 శాతం జరిమానా విధిస్తూ ఐసీసీ నిర్ణయం తీసుకుంది. లార్డ్స్ టెస్టులో ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్ అవుటైన తర్వాత సిరాజ్ దూకుడుగా వ్యవహరించినందుకు ఐసీసీ ఈ చర్యలు తీసుకుంది. అలాగే అతడి ఖాతాలో ఒక డీ-మెరిట్ పాయింటును కూడా చేర్చింది.ఐసీసీ కోడ్ ఆఫ్ కండక్ట్ ఆర్టికల్ 2.5 ప్రకారం అభ్యంతరకరంగా ప్రవర్తించడం, భాషను వినియోగించడం, బ్యాటర్ ఔట్ అయి వెళుతున్నప్పుడు దురుసుగా వ్యవహరించడం నేరమని ఐసీసీ పేర్కొంది. బెన్ డకెట్ ఔటైన క్రమంలో సిరాజ్ దూకుడుగా వ్యవహరించినట్లు గుర్తించారు.దీంతో సిరాజ్‌కు జరిమానాతో పాటు డీమెరిట్ పాయింటును విధించింది. గత రెండేళ్ల కాలంలో సిరాజ్‌కు ఇది రెండో తప్పిదం కావడంతో అతని ఖాతాలో రెండు డీ-మెరిట్ పాయింట్లు చేరాయి. రెండేళ్ల కాలంలో ఆటగాడి ఖాతాలో 4 డీ-మెరిట్ పాయింట్లు ఉంటే అవి సస్పెన్షన్ పాయింట్లుగా మారతాయి. అప్పుడు మ్యాచ్ నిషేధం ఎదుర్కొనే ప్రమాదం ఉంటుంది.

# 'బాహుబలి- ది ఎపిక్' ఆ ఆలోచనే సూపర్బ్



టైటానిక్, అవతార్-1, ఇంటర్ స్టెల్లార్ లాంటి భారీ సినిమాలను రీరిలీజ్ చేస్తే ప్రపంచవ్యాప్తంగా ప్రజల నుంచి అద్భుత స్పందన వచ్చింది. వీటిని భారతదేశంలో కూడా రీరిలీజ్ చేయగా సంచలన వసూళ్లను సాధించాయి. ఇటీవల కొన్ని తెలుగు, హిందీ, తమిళ చిత్రాలను రీరిలీజ్ చేయగా, అద్భుత వసూళ్లతో ఆకట్టుకున్నాయి. రీరిలీజైన ప్రతి సినిమాని ప్రజలు చూడరు. కానీ కొన్ని అరుదైన అసాధారణ సినిమాలను మాత్రమే చూస్తారు.
అయితే అలాంటి కేటగిరీకి చెందే సినిమాలు బాహుబలి 1- బాహుబలి 2. అయితే ఈ సినిమాలను విడివిడిగా కాకుండా, కలిపి ఒకే సినిమాగా థియేటర్లలో వీక్షించే భాగ్యం కలిగితే? ఇలాంటి మాస్టర్ ప్లాన్ ఇప్పుడు సర్వత్రా ఉత్కంఠను పెంచుతోంది. బాహుబలి 1 , బాహుబలి 2 చిత్రాలు విడివిడిగా రిలీజైనప్పుడు చాలా మంది కలిపి వస్తే ఎంతో బావుండేదని భావించారు. ఒక కథను రెండుగా విడదీసి విడి విడిగా చూపించడం అనే ఫార్ములాను తెలివిగా సద్వినియోగం చేసుకున్న ఆర్కా మీడియా- రాజమౌళి బృందాలు, ఇప్పుడు బాహుబలి - ది ఎపిక్ పేరుతో రెండిటిని ఒకే సినిమాగా చూపించి కాసులు కొల్లగొట్టడానికి ప్లాన్ చేయడం ఆసక్తికరం. బాహుబలి చిత్రాన్ని మళ్లీ ఫ్రెష్ గా చూస్తున్నామా? అనిపించే వీలుంది.బాహుబలి ది ఎపిక్ చిత్రానికి ఆన్ లైన్ బుకింగ్స్ లో అద్భుత స్పందన వస్తోందని ట్రేడ్ చెబుతోంది. ఇది దేశంలోని రీరిలీజ్ రికార్డులన్నిటినీ తుడిచేయడం ఖాయమని కూడా చెబుతున్నారు. ఈ మోస్ట్ అవైటెడ్ చిత్రం అక్టోబర్ 31న గ్రాండ్ గా విడుదల కాబోతుంది. ఇప్పటి నుంచి ఆడియెన్ లో బోలెడంత క్యూరియాసిటీ నెలకొంది. ఆన్ లైన్ సర్వేల్లో %- బాహుబలి ది ఎపిక్ -%ని థియేటర్లలో చూస్తామన్న ఆడియెన్ అంతకంతకు పెరుగుతున్నారని సమాచారం.



మలైకా అరోరా
బోల్డ్, బ్యూటిఫుల్
మరియు
మరపురానిది



శ్రీదేవి
అందాన్ని
ఒక
ఫ్రేమ్‌లో
బంధించా
రు

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com